Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

Hotel D.S.R Paradise



Function Hall
- Fully Airconditioned
- 250 seating capacity
- L.E.D lighting
- Ample car parking

అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణము

సంపుటి: 82 • సంచిక: 32 • 3-8-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

మైత్రి డెంటల్ క్లినిక్

- పిప్పిపళ్లకు మరియు విరిగిన పళ్లకు అత్యాధునిక లేజర్‌చికిత్స.
- ఎత్తుపళ్లు, వంకరటింకర పళ్లను సరిచేయు చికిత్స.
- పళ్లు ఊడిపోయిన వారికి కృత్రిమ దంతాలు అమర్చుట.

డా॥ ఎ. నరేంద్రనాథ్, BDS. డెంటల్ సర్జన్
డా॥ శ్రీమతి ఎ. సునీత, BDS. డెంటల్ సర్జన్

వెంకటరమణ థియేటర్ ఎదురుగా, దర్గామిట్ట, నెల్లూరు.
ఫోన్ : 2341840, 9989100887

మిస్టరీగా రైలు ప్రమాదం!

ప్రమాదాలు ఎందుకు జరుగుతాయో, ఎప్పుడు జరుగుతాయో, ఎట్లా జరుగుతాయో ఎవరూ వూహించలేరు. కానీ అవి జరిగిన తర్వాత మాత్రం కారణం తెలుస్తుంది, తప్పు తెలుస్తుంది. అదే రైలు ప్రమాదం జరిగితే మాత్రం అంతా అయోమయమే. ఎవరూ నిజం చెప్పరు. ఏ దర్యాప్తు సంఘమూ వాస్తవమేమిటో ప్రజలకు తెలియనివ్వదు. గూడుపుఠానీ వలె వుంటుంది వ్యవహారం. మొన్న 31తేది నెల్లూరులో జరిగిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం పరిస్థితీ అంతే.

మూడు హాళ్లకు ఎదురుగా, సౌత్ స్టేషన్ అండర్ బ్రిడ్జికి సమీపంలో జరిగిందీ ప్రమాదం. దాన్ని ప్రమాదం అనడం కంటే ఘోరం అని పిలవడం సమంజసం. భగవంతుడనే వాడు మనుషుల ప్రాణాలు తీయడానికి ఇంతటి కర్కశమైన, క్రూరమైన, పాశవికమైన పద్ధతి ఎందుకు ఎంచుకొంటాడో అర్థమే కాదు. ఆ ప్రమాద దృశ్యం చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. అది జరిగిన తీరు చూస్తే హృదయం ద్రవిస్తుంది. అందులో మరణించిన వారి దయనీయ స్థితిని చూస్తే బండరాతి గుండె కూడా కరిగి నీరైపోతుంది.

ఢిల్లీ నుంచి మద్రాసుకు వెళ్తున్న ఈ రైలులోని "ఎస్-11" స్లీపర్ కోచ్ వున్నట్లుండి తగలబడిపోయింది. వేకువఝాము 4.08 గంటలకు నెల్లూరు రైల్వే స్టేషన్ దాటింది ఆ రైలు. ఆ సమయంలో ప్లాట్‌ఫామ్ మీద వున్న వారెవ్వరికీ అగ్నిప్రమాద సూచన కూడా కన్పించలేదు. కానీ 4.09 నిముషాలకు విజయమహల్ గేటు దాటేటప్పుడు అక్కడి గేట్‌మ్యాన్ ఒక పెట్టెలో మంట చూసి డ్రైవర్‌ను అప్రమత్తం చేశాడు. మరొక నిముషం లోపలే మూడు హాళ్లకు ఎదురుగా రైలు ఆగిపోయింది. రైలు కట్టకు పక్కగా నివసించే గుడిసెవాసులు ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా



అగ్గికి బుగ్గి అయిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-11 బోగి.

పెట్టెవద్దకు పరుగుపెట్టారు. కొద్ది నిముషాలలోనే ఫైర్ ఇంజన్లు వచ్చాయి. కానీ ఈ లోగానే పెట్టెలోని 28 మంది ప్రయాణీకులు అత్యంత దయనీయమైన స్థితిలో మల మల మాడి మసి బొగ్గులై పోయారు. మరొక పాతిక మంది వరకు తీవ్రంగా గాయాల పాలైనారు. వినడానికి విచిత్రంగా, విడ్డూరంగా వుందీ ప్రమాదం.

కొరవ 8వ పేజీలో



కీ॥శే॥ బద్వేలు వెంకట సుబ్బమ్మ గారు
మరణం : 03-08-1991

21వ వర్ధంతి

మమతానురాగాలతో మమ్ములను గుండెల్లో దాచుకున్న అమృతమూర్తి
మా ఇంటి దైవం **బద్వేలు వెంకట సుబ్బమ్మ** గారి
వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకొంటూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్లు :
బద్వేలు రమణారెడ్డి - లేట్ శ్రీదేవమ్మ
లేట్ బద్వేలు ఆదిశేషారెడ్డి - సరసమ్మ
బద్వేలు కృష్ణారెడ్డి - యశోదమ్మ
బద్వేలు గోపాల్‌రెడ్డి - సుజాతమ్మ
బద్వేలు శ్రీనివాసులురెడ్డి - రేణుకమ్మ
బద్వేలు సుధాకర్‌రెడ్డి - శైలమ్మ

కుమార్తెలు - అల్లుళ్లు :
లేట్ బుజ్జమ్మ - లేట్ దేవిరెడ్డి సుందరరామిరెడ్డి
లేట్ శేషమ్మ - చెన్నూరు వెంకటసుబ్బారెడ్డి
కౌశల్యమ్మ - బండి రామస్వామిరెడ్డి

మనుమలు, మనుమరాళ్లు, ముని మనుమలు, ముని మనుమరాళ్లు

VAMSI RAM Builders
Hyderabad

మనుమడు - బద్వేలు సుబ్బారెడ్డి - జ్యోతి
ముని మనుమరాలు - బద్వేలు సోహిని

సిగ్గుండాలి

ప్రపంచంలోని అతి పెద్ద రైల్వే వ్యవస్థలో మనదీ ఒకటి. రోజుకు మూడు కోట్ల మంది ప్రయాణీకులకు అదే ఆధారం. రోజుకు 28 లక్షల టన్నుల సరకు రవాణాకు అదే మార్గం. ఒకరకంగా చెప్పాలంటే భారతీయ జీవన స్రవంతికి జీవనాడి వంటివి మన రైళ్లు. కానీ దుర దృష్టవశాత్తు ప్రపంచంలో అత్యంత దరిద్రంగా, దౌర్భాగ్యంగా, దగుల్బాజీతనంగా నడుస్తున్న రైళ్లు కూడా మనవే. బ్రిటీష్ వాడు తన సైనిక అవసరాల కోసం వందేళ్ల క్రితం ఏమి చేసి వెళ్లాడో, ఇప్పటికీ ఆ శిథిల వ్యవస్థనే పదిలంగా కాపాడుకొంటూ వస్తున్నాము మనం. సంఖ్యలో తప్ప ప్రామాణికతలో అణుమాత్రం అభివృద్ధి లేదు. రైలు పెట్టెల నిండా చెత్తాచెదారం. ప్రయాణీకులకు మనశ్శాంతి లేకుండా బిక్ష గాళ్లు, చిల్లర వస్తువులమ్మే వాళ్ల గోల. చిరిగిన సీట్లు. మాసిన దుప్పట్లు. కిటికీ మీద చెయ్యి ఆనిస్తే చొక్కా ఖరాబు కావడం ఖాయం. తుప్పుపట్టిన కమ్ములు, బిగుసుకపోయిన షట్టర్లు. బాత్‌రూంలోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. స్టేషన్లలో కూడా భరించరాని కంపు. పట్టాల మీద పెంటా, పేడ. ప్లాట్‌ఫార్మ్‌ల మీద కూచోవడానికి కుర్చీ వుండదు. తిరిగే ఫ్యాన్ ఒక్కటి కన్పించదు. రైళ్లు ఎందుకు ఆలస్యంగా నడుస్తాయో తెలియదు. ఎప్పుడు బయలుదేరుతుందో, ఎప్పటికి గమ్యం చేరుతుందో చిలక జోస్యాలు చెప్పాల్సిందే. స్టేషన్‌లో టిక్కెట్ కొనడం, మొదటి ఆట సినిమా టిక్కెట్ కొన్నంత కష్టం. అనంతమైన టిక్కెట్ క్యూ లైన్లతో తిరనాళ్ల వలె వుంటుంది. ఎయిర్ కండీషన్ కోచ్‌లెక్కితే నల్లులు, బల్లులు, బొద్దింకలు, ఎలుకలు, పందికొక్కులు వీరవిహారం చేస్తుంటాయి. వాటి పెంటతో పెట్టెంతా ముక్కకంపు. జనరల్ పెట్టెలో ప్రయాణం ప్రత్యక్ష నరకం. ఒక్క మాటలో చెప్పాలంటే, భారత ప్రజానీకం పట్ల కేంద్ర ప్రభుత్వానికి వున్న కక్ష అంతా రైల్వేల ద్వారా తీర్చుకొంటుందన్పిస్తుంది.

పొరుగునే చైనా వుంది. షాంఘాయ్ – బీజింగ్ నగరాల మధ్య 1300 కిలోమీటర్ల ప్రయాణం కేవలం ఐదు గంటలలో గడిచిపోతుంది. అదే బొంబాయి ఢిల్లీ నగరాల మధ్య రైలు దాదాపు ఒక రోజు ప్రయాణిస్తుంది. వారి రైళ్ల సగటు వేగం 300 కిలోమీటర్లు. మనది కేవలం 80 కిలోమీటర్లు మాత్రమే. అక్కడి రైళ్లు తళ తళ మెరిసే అద్దాల ఫలకం వలె వుంటాయి. మన రైళ్లను చూస్తే పిడకలు అంటించిన పాత గోడ జ్ఞాపకానికొస్తుంది.

పాపం మన రైల్వే మంత్రులు మంచి వాళ్లే; కానీ వారి బుద్ధి మాత్రం పాతకమైనది. తమ వూరికి రైలు స్టేషన్, తమ జిల్లాకు రైల్వే డివిజన్, తమ అనుచరులకు ఉద్యోగాలు, తమ అంతేవాసులకు బదలీలు, ప్రమోషన్లు ఇప్పించుకోవడానికే రైల్వే మంత్రులకు వున్న పుణ్యకాలం కాస్తా గడిచిపోతున్నది. రైల్వే అధికారుల మానసాలు శీతల గిడ్డంగులలో సేద దీరుతున్నాయి. అభివృద్ధి, ఆధునీకరణ వంటి పదాలను వారు దగ్గరకు రానివ్వరు. ఏ చిన్న మార్పుకైనా పెద్ద అడ్డంకి చూపుతారు. సంస్కరణలకు వారు లేవనెత్తే ప్రధాన సమస్య – భద్రత. చిన్న బోల్టు మార్చాలన్నా రైల్వే సేఫ్టీ సంస్థ నుంచి అనుమతి కావాలి. అందుకు ఏళ్ల పూళ్ల పడుతుంది. కానీ విచిత్రంగా రైల్వే అధికారులు ఏ భద్రత సాకుగా చూపి కొత్తదనాన్ని నిలువరిస్తున్నారో, అదే భద్రతా లోపం ప్రయాణీకుల ప్రాణాలు హరించి వేస్తున్నది. భారత దేశంలో జరిగినన్ని రైలు ప్రమాదాలు ప్రపంచంలో మరే దేశంలోనూ జరగడం లేదు. సంవత్సరానికి కనీసం పది పెద్దస్థాయి ప్రమాదాలు జరగడం ఆనవాయితీ అయిపోయింది. 2009 నుంచి వీటి సంఖ్య అమితంగా పెరిగిపోతున్నది. 2010లో 16 ప్రమాదాలు జరిగితే 2011లో 12 జరిగాయి. 2012లో ఇప్పటి వరకు ఈ సంఖ్య 13 దాటింది. ఎన్నో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోయిన ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం రైల్వే నిర్వహణలో మానవ తప్పిదాలే తప్ప భగవంతుడి కర్మ సిద్ధాంతం కాదు.

జమ్మిచైతు

ఆధునీకరణలో అధికారులు చూపుతున్న అలసత్వం, చెదురు మదురుగా చేపట్టిన నవీకరణ పథకాలలో విపరీతమైన జాప్యం వల్లనే మన రైళ్లు ఇంత అధ్వాన్నంగా నడుస్తున్నాయి. ప్రపంచస్థాయి ప్రమాణాలకు వెయ్యామడల దూరంలో ఆటవిక యుగంలో మ్రగ్గుతున్నాయి. విదేశీయులు మన రైళ్లు ఎక్కితే ఫక్కున నవ్వుతున్నారు. అయినా మన అధికారులకు, రైల్వే మంత్రులకు సిగ్గు కలగడం లేదు. ఆధునిక ప్రపంచ ప్రగతికి రైల్వే వ్యవస్థ జీవనాడి వంటిది. అటువంటి కీలక రంగాన్ని ప్రభుత్వాలు ఇంత నిర్లక్ష్యం చేయడం నిజంగా సిగ్గుమాలిన తనం.

జనవాక్కి

దేశాధ్యక్షుడు – ఉపాధ్యక్షుడు!

భారతదేశం 1950 సంవత్సరంలో రిపబ్లిక్‌గా అవతరించిన తర్వాత దేశాధ్యక్షుడు ఉత్తర భారతదేశానికి చెందిన వాడైతే ఉపాధ్యక్షునిగా దక్షిణ భారతానికి చెందిన వాడుగా వుండాలని అనుకొన్నారు. అందువల్లనే రాజాజీని అధ్యక్షుడుగా చేయాలనుకొన్నారు. కాని ఆదిలోనే హంసపాదు అయ్యింది. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ విషయాన్ని అందరూ ముఖ్యంగా దక్షిణ భారతీయులు విస్మరించారు. ఇప్పుడైనా ఈ ప్రతిపాదన అమలుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. ప్రస్తుత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ఉప రాష్ట్రపతి కాబోయే హమీద్ అన్సారీలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారే. ఈ విషయమై అందరూ ఆలోచించాల్సి వుంది.

పి.సత్యనారాయణజెట్టి — వెంకటగిరి

ధీరోదాత్త స్త్రీమూర్తి కెప్టెన్ లక్ష్మీ సెహగల్!

భారత స్వాతంత్ర్య సమరయోధులంతా ఒక్కొక్కరు వెళ్లిపోతున్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు నేతాజీ నెలకొల్పి నడిపిన భారతీయ సైన్యంలో 'ఝాన్సీ లక్ష్మీబాయ్' పేరిట ఏర్పరచిన మహిళా దళం సేనాని లక్ష్మీ సెహగల్ 98వ ఏట ఆమె వెళ్లిపోవడం నిర్ఘాంతపరచలేదు. గానీ, అంతులేని ఆవేదన గలిగించింది. బ్రతుకంతా సేనానిగా, వైద్యులుగా, సంఘసేవికగా దేశాన్ని సేవించిన ఆ హృదయ సుందరమూర్తి – తన తదనంతరం సైతం వైద్యరంగాన్ని, తద్వారా ప్రజల్ని సేవించడానికి తన కళ్లని, దేహాన్నీ ఈ సమాజానికి అమూల్య కానుకగా ప్రకటించి వెళ్లారు. వారి ఈ కానుక ఆమెకు వైద్యం ప్రవృత్తే గానీ, వృత్తి కాదని, సమాజసేవ పట్ల అంతరంగంలో ఆమెకున్న అత్యంత తీవ్ర సానుకూల భావ గాఢతనీ స్పష్టపరుస్తున్నది. జాతీయస్థాయిలో ఇంతటి ప్రముఖ స్త్రీమూర్తి దేహ సమర్పణ చేయడం దేశంలో ఇదే ప్రథమం. ఆమె దేహ సమర్పణతో ఆమె సాధించే వైద్య సంబంధ ఫలితాల ద్వారా సమాజానికి చేకూరే ప్రయోజనాల దృష్ట్యా ఆమె చిరంజీవౌతారు.

తిక్కవరపు సుకుమార్‌రెడ్డి — నెల్లూరు

పదవికి వన్నె తెస్తారు!

భారతదేశ 13వ రాష్ట్రపతిగా ప్రణబ్‌ముఖర్జీ ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ యవనికపై ఆయన స్థానం సామాన్యమైనది కాదు. రాష్ట్రపతులుగా వ్యవహరించిన వారు రబ్బర్ స్టాంప్‌లుగా పరిమితమైనవారు ఎక్కువ మంది వున్నారు. ప్రణబ్ ముఖర్జీగారు ఈ పదవి నిర్వహణలో తనదైన ముద్రవేస్తారని భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ వ్యాప్తంగా పెంచుతారన్న నమ్మకముంది.

పి.అరుణకుమారి — నెల్లూరు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

7-8-1942
పేజీలు : 8 వెల: అణా

భాగ్యవంతులకు గాంధీజీ హితవు

సంస్థానాధీశులు, జమీందార్లు, వర్తక శిఖామణులు మున్నగు భాగ్యవంతులకు గాంధీజీ చక్కని సలహా ఇచ్చారు. పోలీస్ శక్తి ఎల్లకాలం వీరి నిరంకుశత్వాన్ని, భాగ్యాన్ని కాపాడలేదు. ప్రజలు మేల్కొంటున్నారు; కళ్లుదెరిస్తే ఈ పెద్దలకు ఏమీ దక్కదు చివరకు. అందుకని ధర్మకర్తలుగా ప్రవర్తించండి. లేక కనీసం అధికారాన్ని, భాగ్యాన్ని ప్రజలతో పంచుకోరాదా అని గాంధీజీ వారికి హితవు నిచ్చినారు.

ఓ పిచ్చి గాంధీ! ఇంకా నీకు ఆశలున్నాయా ఈ విషయంలో? చరిత్ర, నీ గంపెడు అనుభవం, మానవ నైజం, జీవిత సత్యాన్ని వేయి నోళ్ల చాటుతున్నదే? దానికంతా మరొక గాలి దుమారం రావాలె.

నెల్లూరు ముచ్చట్లు

పబ్లీకు ప్రాసిక్యూటరు పదవి వార్ని వూరించి, వీర్ని వూరించి చివరకు వవ్వేటి విశ్వనాధరావు సాహెబ్‌ల వారి మీదనే వాలింది. అబ్బా! కొన్ని వేల సంవత్సరాలుగా జేసిన తపస్సు నేటికి ఫలించిందిరా దేముడా!

యుద్ధానికి లవలేశం గూడా పని జేసి ఎరుగని యువకులంతా పొట్ట తడువుకోవడం వృధా శ్రమగాక మరేం ఉంటుంది చెప్పండి?

గవర్నమెంటు ప్లీడరు షిప్పు రిజర్వుడు క్లాసు కుర్చీదాటి బ్యాక్ బెంచీకి పోవడానికి సకారణం గనిపించదు. పోనీ ఎవరైతేనేం?

50 ఏళ్ల క్రితం ఈవారం

3-8-1962
పేజీలు: 8 వెల: 0-20 న.పై

మద్రాసు చోరీ

సినిమా తార కమలా కోట్నీస్‌కు సంబంధించిన మూడు లక్షల రూపాయల విలువచేసే డైమండ్ నగల చోరీ సందర్భంలో ఆమె ఫిర్యాదుపై గత 26వ తేది మద్రాసు పోలీస్‌చే నెల్లూరు అజంతా హోటలులో అరెస్ట్ గావింపబడిన గంగపట్నం వాస్తవ్యుడు కొండూరు చంద్రశేఖర్‌రెడ్డికి మద్రాసు హైకోర్టు 1వ తేది బెయిల్ గ్రాంటు జేసింది. పదివేల రూపాయల పూచీ పత్రాలు సైదాపేట ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటు పరిశీలనకు పంపి ఉన్నందున చంద్రశేఖర్‌రెడ్డి ఇంకా మద్రాసు సెంట్రలు జైలులో రిమాండులోనే ఉన్నాడు. జామీను పత్రాలు పరిశీలనైన వెంటనే అతని విడుదల జరుగుతుందట.

స్త్రీ దారుణ హత్య

నెల్లూరు మూలపేట కోనేటిమిట్టన కాపురముంటున్న ఎన్‌సిసి ఆఫీసరు మేజరు కెపిఎన్‌రెడ్డిగారింటిలో 2వ తేది రాత్రి షుమారు పది గంటల సమయంలో పాతికేళ్ల ఒక స్త్రీ దారుణంగా హత్యగావింపబడింది. మేజరు రెడ్డి 2వ తేది ఉదయం నాయుడుపేట ప్రాంతానికి క్యాంపు పోయారని, వారు లేకుండడం జూచి అతని వంట మనిషి ఆరంబాకం వాస్తవ్యుడు గోవిందరెడ్డి అనే వ్యక్తి ఈ హత్య గావించి పరారైనాడని తెలుస్తున్నది. ఆ యింటిలో మేజరు రెడ్డి వంట మనిషి తప్ప యింకెవ్వరూ లేరని, క్యాంపుపోతూ యింటిని వంట మనిషి స్వాధీనం జేసిపోయారని తెలుస్తున్నది. ఈ హత్య జరిగిన సమయంలో వంట మనిషి గోవిందురెడ్డి తప్ప ఇంకెవ్వరూ లేరు.

పిటి గోపాలాచారి మృతి

నెల్లూరు బర్మాషెల్ ఏజంటు, మాజీ మునిసిపల్ కౌన్సిలరు, కాలేజి కమిటీ మాజీ సభ్యుడు, సతత ఖద్దరుదారి, ఏసి అభిమాన కోటిలో ముఖ్యుడు పిటి గోపాలాచారి(62) 28వ తేది మద్రాసులో మరణించారు. గోపాలాచారి కుటుంబానికి మా సానుభూతి.

నెల్లూరు ముచ్చట్లు
విలక్షకుడు

తడ సైకో దొరికాడా?

భద్రాచలం నుంచి చెన్నై వెళ్తున్న ఆర్టీసి బస్సులో ముగ్గురి ప్రాణాలు నిలు వునా తీసిన సైకో'ను పోలీసులు అదుపు లోనికి తీసుకొన్నారన్న ప్రచారం జరుగు తుంది. ఇతడిని చెన్నైలో అదుపులోనికి తీసుకొన్నట్లు సమాచారం. కానీ పోలీసు అధికారులెవరూ ఈ విషయాన్ని ధృవీక రించడం లేదు. పూర్తిస్థాయి దర్యాప్తు ముగిస్తేగానీ ఈ విషయాన్ని వెల్లడించడా నికి ఇష్టపడడం లేదు.

దగ్ధ ఘటన - 2

జిల్లాలో ఇప్పటివరకు నమోదైన దగ్ధ ఘటనల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయింది 30వ తేది జరిగిన తమి ళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఎస్ - 11 బోగీ దగ్ధమైన ఘటనగానే చెప్పుకోవచ్చు. జిల్లాలో ఇప్పటివరకు రైలు పట్టాలు తప్పడం వంటి సంఘటనలు తప్ప దగ్ధ ఘటనలు లేవు. 1990 ప్రాంతంలో జాతీయ రహదారిపై బోగోలు మండలం ఉలవపాళ్ల లైన్స్‌నగర్ కాలనీ వద్ద జరి గిన గడ్డి లారీ దగ్ధ ఘటనలో 12 మంది మాడి బొగ్గుల్లా మారారు.

క్షతగాత్రుల వైద్య ఖర్చు భరిస్తాం!

తమిళనాడు ఎక్స్‌ప్రెస్ దగ్ధ ఘట నలో గాయపడిన క్షతగాత్రులకు అవ సరమైన వైద్య సేవల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. 30వ తేది నెల్లూరు పెద్దాసుపత్రి, బొల్లినేని, నారాయణ ఆసుపత్రులలో బాధితుల పరామర్శ అనంతరం సిఎం ఈ భరోసా యిచ్చారు.

దటీజ్ మెగాస్టార్!

తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్ - 11 బోగీ దగ్ధమై పెద్ద సంఖ్యలో ప్రయాణీకులు చనిపోయిన విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలికి వచ్చిన తొలి విఐపి రాజ్యసభ సభ్యుడు చిరంజీవి. స్టేషన్‌లో కాలుపెట్టిన అనం తరం నేరుగా కాలిన పెట్టెలోకి ధైర్యంగా ప్రవేశించారాయన. ఆ సమయానికి కాలిన శవాలను బయటకు తీస్తున్నారు. అక్కడి నుంచి శవాలను భద్రపరచిన పోస్ట్‌మార్టం గదిని పరీక్షించారు. ఆ తర్వాత రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు, వైకాపా నేత విజయమ్మలు చిరంజీవి అనుసరించిన మార్గాన్ని అను సరించక తప్పలేదు.

మైకు వీరుడు!

తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో దగ్ధమైన ఎస్-11 బోగీని సంఘటనా స్థలి నుంచి రైల్వేస్టేషన్‌కు తరలించాక దాన్ని చూసేం దుకు వేలాది మంది ఎగబడ్డారు. వీరిని అదుపు చేయడం సివిల్, రైల్వే పోలీ సులకు అలివి కాలేదు. ఈ సమయంలో రైల్వే ఉద్యోగి ఒకరు హ్యాండ్ మైకు తీసు కొని "మీరు మమ్మల్ని ఇబ్బంది పెడుతు న్నారు... కార్యక్రమాల నిర్వహణకు సహ కరించండని" పదే పదే అటు ఇటూ తిరు గుతూ కొంత మేర జనాన్ని అదుపుచేసి మైకు వీరుడనిపించుకొన్నాడు.

ఈసీలు ఇక మీ సేవలో...

రిజిస్ట్రార్ ఆఫీసుల్లో భూమి ఎవరి ఆధీనంలో ఉందో తెలిపే ఈసీలు ఇక ఇవ్వరు. జిల్లాలోని ఈ సేవా కేంద్రాలు, తహశీల్దార్ కార్యాలయాల్లోని ప్రజా సేవా కేంద్రాలు, ఫ్రాంచైజ్ సెంటర్లలో ఇక నుంచి వీటిని ఇస్తారట. అన్ని చోట్ల ఇవ్వడం మంచిదే అయినా ఈ సేవా కేంద్రాల్లో సర్వీసు టాక్స్, ప్రజా సేవా కేంద్రాల్లో జవాబు చెప్పనితనం ప్రజ లను ఇబ్బంది పెడతాయి.

పెన్నలో గల్లంతు

నెల్లూరు బట్వాడిపాళెంలోని అరబ్బీ పాఠశాలలో చదువుకొనే ముగ్గురు పిల్లలు 29వ తేది పెన్నానదిలో ఈతకు వెళ్లగా నయీంతుల్లా(17) అక్క డికక్కడే మరణించగా, మొహిబుల్లా, రఫీ లను మాత్రం ఇక్కడ బట్టలు ఉతికే రజ కులు ప్రాణాలు కాపాడారు. నయీం తుల్లా శ్రీకాళహస్తి వాసి. మొహిబుల్లాది సింగరాయకొండ, వీరిద్దరూ రంజాన్ సెలవులకు స్వస్థలాలకు వెళ్లక మిత్రుడు కిసాన్‌నగర్‌కు చెందిన రఫీ ఇంటికి వెళ్లి ప్రాణాలపైకి తెచ్చుకొన్నారు.

యమభటులు తిష్టవేసి ఉన్నారా?

తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఎస్ - 11 బోగి దగ్ధమై పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన నెల్లూరు మూడు హాళ్ల ముందు రైల్వే ట్రాక్ ప్రాంతంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతుంటుంది. రైల్వే ట్రాక్ దాటుతూ చాలా మంది ఇక్కడ ప్రాణాలు కోల్పోతుంటారు. ఇటీ వలే ఇక్కడ ఇద్దరు యువకుల మరణం మిస్టరీగా మిగిలిపోయింది. ఈసారి ఇంత మంది చనిపోవడంతో ఈ ప్రాంతంలో యమభటులు తిష్టవేసి ఉన్నారా అనే అనుమానాలు కలుగకమానడం లేదు.

పదవి చిన్నది - హంగామా పెద్దది!

అర్ధ రూపాయి కోడికి ఆరు రూపాయల మసాలా అన్నట్లు వ్యవహ రిస్తున్నారు యూత్ కాంగ్రెస్‌లో పదవులు పొందిన నేతలు. ఇటీవల యూత్ కాం గ్రెస్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరి గాయి. కొత్త వాళ్లు ఈ పదవులకు ఎన్ని కయ్యారు. నగరంలో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, నిలువెత్తు ఫోటోలు పెడుతున్న ఈ కొత్త తరం నేతలను చూసి విస్తుపోవడం ప్రజల వంతవుతుంది.

సిపిఎం దిగ్భ్రాంతి

తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఘోర ప్రమాదం పట్ల సిపిఎం పార్టీ జిల్లా కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ప్రమాద స్థలిని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటే శ్వర్లు, ఎం.మోహన్‌రావు సందర్శించారు. బాధితులు చికిత్స పొందుతున్న హాస్పిట ళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. ఘట నపై లోతుగా దర్యాప్తు జరపాలని ప్రాణాలు కోల్పోయిన వారికి పది లక్షల రూపాయలను రైల్వేశాఖ ఎక్స్‌గ్రేషి యాగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

టిఎస్ఆర్ సంతాపం

ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న తమిళ నాడు ఎక్స్‌ప్రెస్ నెల్లూరులో ఘోర ప్రమాదానికి గురికావడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.



నెల్లూరీయుడు హైదరాబాద్‌లోని రక్షణశాఖ మిస్సైల్ కాంప్లెక్స్‌లో శాస్త్రవేత్త జి.సతీష్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తరఫున యంగ్ ఇంజనీర్ అవార్డును అందజేస్తున్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి.

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపాన్ని తెలియ జేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకో వాలని ఆయన ఆకాంక్షించారు.

అబ్దుల్ అజీజ్ ట్రస్ట్ చేయూత!

తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘ టనలో గాయపడిన వారికి నెల్లూరు లోని హాజీ అబ్దుల్ అజీజ్ చారిటబుల్ ట్రస్ట్ పలు విధాలుగా సహాయ సహకా రాలు అందించింది. అబ్దుల్ అజీజ్ నగరంలోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పరా మర్శించారు. రైల్వే ఉన్నతాధికార్ల అభ్య ర్థన మేరకు శవాలను భద్రపరిచేందుకు 20 టన్నుల ఐస్ ఉచితంగా అందిం చారు. ఎస్ - 11 బోగీలో ప్రయాణిస్తూ చెన్నైలో ఎంఫిల్ పరీక్ష వ్రాయను వెళ్తూ సర్వస్వం కోల్పోయిన జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి చెందిన షబ్బీర్‌కు దారి ఖర్చు లకు పదివేల రూపాయల ఆర్థిక సహా యాన్ని అందించారు.

డీలర్లపై పిడి యాక్టు

బోగస్ రేషన్ కార్డులు కలిగి ఉన్న డీలర్లపై పిడియాక్టు క్రింద కేసులు నమోదు చేస్తామని ఆర్‌డిఓ మాధవీలత హెచ్చరించారు. బోగస్ కార్డులు, బినామీ పేర్లతో ఉండే కార్డుల తనిఖీ ప్రక్రియ ఆగష్టు 10వ తేది నుంచి చేపడుతున్నారు. డీలర్లు ఇలాంటి కార్డులు కలిగి ఉంటే వెం టనే వాటిని స్వాధీనం చేయాలని లేకపోతే క్రిమినల్ చర్యలు తప్పవ న్నారు. ప్రజలు బోగస్ కార్డులను అధికారులకు అందజేయాలన్నారు. తని ఖీల్లో బయటపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు పనిచేస్తాయో లేదో మరి.

గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు

మూలస్థానేశ్వరస్వామి ఆల యంలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు జరు గుతున్నాయి. పర్యాటక శాఖ నిధులు 30 లక్షల రూపాయలతో ఈ పనులను చేపట్టారు అధికారులు. గతంలో కలె క్టర్‌గా పనిచేసిన రాంగోపాల్ చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. 1100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టారు.

రైల్వే అధికారుల జాడేలేదు

తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం హృదయవిదార కంగా ఉంది. కాలి మాంసపు ముద్దలైన

కొరవ 14వ పేజీలో









• నెల్లూరు, సంగం

బ్యారేజీల పనులు పూర్తిచేయండి!

కలెక్టర్ ఆదేశం



జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఆర్‌అండ్‌బి శాఖ పరిధిలోని పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో ఈ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిపారు. నెల్లూరు, సంగం బ్యారేజి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ కోరారు. 147 కోట్ల రూపాయల అంచనాలతో పెన్నా నదిపై నిర్మిస్తున్న బ్యారేజి నిర్మాణానికి సంబంధించిన పనులను నిర్ణయించిన సమయంలో పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంగం ఆనకట్ట ద్వారా దువ్వూరు, కనిగిరి, కావలి, కనుపూరు రిజర్వాయర్లకు సాగునీరు అందించడంలో సమస్యలు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. సోమశిల ప్రాజెక్టు ద్వారా వివిధ ప్యాకేజీల కింద చేపడుతున్న ఉత్తర, దక్షిణ, కావలి, కనుపూరు కాలువలకు సంబంధించిన లైనింగ్, సైడ్‌వాల్స్, స్ట్రక్చర్, స్లూయిస్ నిర్మాణాలను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించి పనిచేసేలా చూడాలన్నారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న కాలువ పనులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, ఆర్ అండ్‌బి ఎస్ఇలు సోమశేఖర్, విజయకుమార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమకు ప్రతీక నర్సు!

• నారాయణ నర్సింగ్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేలో డాక్టర్ రాజేశ్వరి



గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలు విద్యార్థినులతో అధ్యాపక వర్గం.

వివిధ రకరకాల వ్యాధులతో బాధపడే రోగుల పట్ల నర్సులు సేవాభావంతో మెలగాలని ప్రొఫెసర్ రాజేశ్వరి వైద్యనాధన్ సూచించారు. చింతారెడ్డిపాళెంలోని నారాయణ నర్సింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డేలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నర్సు వృత్తి అంటే తల్లిలా ఆప్యాయతను చూపించే వృత్తి. వ్యాధిగ్రస్తుడు బాధపడుతున్నపుడు అతన్ని తల్లిలా లాలించి స్వస్థత చేకూరేలా చేయాలన్నారు. పెద్దల పట్ల గౌరవం, విధేయత, మంచి ప్రవర్తనతో నర్సులు రాణించవచ్చన్నారు. ట్రైనింగ్‌లో మంచి ప్రతిభ చూపిన స్టెఫీథామస్, జెష్లికాథలిన్‌కు ప్రోత్సాహక బహుమతులందించారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ డైరక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరప్రసాద్, నర్సింగ్ కళాశాల డీన్ డాక్టర్ ఇందిర, డాక్టర్ సతీష్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిధులున్నాయి... ఖర్చు పెట్టరు!

జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల పెడద్రం

నిధుల సమస్య జిల్లాను వెంటాడుతోంది. ప్రధాన శాఖలు నిధుల విడుదల కోసం ఎదురుచూడాల్సి ఉండగా, కొన్ని శాఖలకు నిధులొచ్చినా ఖర్చుచేయలేని పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. విడుదలైన నిధులను సక్రమంగా సకాలంలో ఖర్చు చేయలేని స్థితిలో అధికారులున్నారన్న విషయాన్ని ఇవి నిరూపిస్తున్నాయి. విడుదలైన సొమ్మును ఖర్చు చేయలేకపోతే మురిగిపోతాయి. ఈ లెక్కన పలు శాఖల పనితీరు వలన విడుదలైన నిధులు మురిగి పోతున్నాయి. సాధారణంగా శాఖలవారీగా అవసరాలను గుర్తించి బడ్జెట్‌లో కేటాయింపులు జరుపుతారు. గతంలో ప్రతి మూడు నెలలకోసారి బడ్జెట్ ఆర్డర్లు(బిఆర్ఓ) జారీ అయ్యేవి. దీని ప్రకారం నిధులు ఖర్చుచేయాల్సి వచ్చేది. ఇటీవల దీనిని నెల నెలా ఇచ్చేలా మార్పు చేశారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల కోసం ఏటా రెండు వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు అంచనా. ఇందులో మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, రోడ్లు భవనాలు, పంచాయితీరాజ్, జడ్పీ, ఇరిగేషన్, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం తదితర శాఖలకు భారీగా నిధులు భర్తీ చేసే జాబితాలో ఉన్నాయి. ప్రధానమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టడంలేదన్న విమర్శలు వ్యక్తమౌతున్నాయి. వ్యవసాయశాఖకు అందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించిన నిధులు విడుదల కాలేదు. మరోవైపు ఆయా శాఖలకు కేటాయించిన నిధులు ఖర్చు చేయలేని పరిస్థితి ఎదురౌతోంది. సాంఘిక సంక్షేమ శాఖ ఉపకార వేతనాలకు 85 కోట్ల రూపాయలు విడుదలకాగా ఇప్పటివరకు 50 లక్షల రూపాయలు కూడా ఖర్చు చేయలేదు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు ఈ కార్యక్రమంలో 18 కోట్ల రూపాయలు విడుదలకాగా ఇప్పటివరకు 16 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు సమాచారం. ప్రధానమైన శాఖలకు ఒకవైపు నిధుల కొరత ఏర్పడుతుంటే మరోవైపు విడుదలైన నిధులను సరిగ్గా ఖర్చుచేయలేక పోవడం ఆ శాఖల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

• ఒలింపిక్స్‌లో

పతకాలు గెలవాలి!

సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆకాంక్ష



లండన్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత క్రీడాకారులు 81 మంది ఏదో ఒక పతకం గెలవాలన్న ఆకాంక్షను సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ వ్యక్తం చేశారు. ఎసి స్టేడియంలో జరిగిన ఫౌండేషన్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. బీజింగ్‌లో జరిగిన ఒలింపిక్స్‌కు 57 మంది క్రీడాకారులు హాజరయ్యారని, ఈ సారి 81 మంది వెళ్లడం మరింత శుభసూచకమన్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, జూడో, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నీస్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ పోటీల్లో భారత క్రీడాకారులు పతకాలు సాధించి దేశకీర్తిని ఇనుమడింపచేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడారంగంపై సరైన దృష్టిసారించకపోవడం, క్రీడా పథకాలు సక్రమంగా అమలు చేయక పోవడం వంటి కారణాల వల్ల మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటలేకపోతున్నారన్నారు. దేశంలో గ్రామస్థాయి నుంచే క్రీడాకారులను వెలికితీసి ప్రోత్సహిస్తే పతకాలకు కొదవ ఉండదన్నారు. రాకేష్ చౌదరి, సరాబు సుబ్రహ్మణ్యం, ఎం.ప్రసాదరావు, శేషు, పి.శ్రీనివాసులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

• నిధులిస్తామన్నా

కదలని ఐసిడిఎస్!

ప్రభుత్వం విడుదల చేసే నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశ ముంటుంది. పలు శాఖల నుంచి నిధుల విడుదలకు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ఎలాగైనా వాటిని విడుదల చేయించుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుంటారు. దీనికి విరుద్ధంగా ఉంది ఐసిడిఎస్ వ్యవహారం. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య నిధులిస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ(ఐసిడిఎస్)కు ఆర్‌డబ్ల్యుఎస్ నిధులిస్తామంటే మాకొద్దనే వద్దంటున్నారట ఆ శాఖ అధికారులు. దీంతో అంగన్‌వాడీల్లో మరుగుదొడ్ల నిర్మాణం జరగక చిన్నారులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఒకటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడానికి, విద్యను అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ కేంద్రాల్లో మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో అంగన్‌వాడీ సెంటర్లలో ఉండే పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు అధికారులు. దీనికి సంబంధించి 2003 లోనే అనుమతి లభించగా ఆనాటి నుంచి 2008 వరకు అనగా దాదాపు ఐదేళ్ల వరకు ఈ మరుగుదొడ్ల నిర్మాణ పనులే చేపట్టలేదు. మొత్తం 1396 మరుగుదొడ్లను కట్టాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 400 మరుగుదొడ్లు మాత్రమే కట్టారు. చిన్నారుల సంక్షేమం దృష్ట్యా ఐసిడిఎస్ అధికారులు తక్షణం స్పందించి మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెప్తున్నప్పటికీ నిర్మాణం నిలచి పోయింది. వారి నుంచి తగిన విధంగా స్పందన కరువవుతోంది.

ఇదేమి చోద్యం

హెచ్‌ఆర్ పాలసీ పెట్టండి!

⏭ ఐకెపి సిబ్బంది డిమాండ్

ఇందిర క్రాంతి పథం ఉద్యోగులు తమకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరుతూ గత పది రోజుల నుంచి ఆందోళన బాటపట్టారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభించి వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నెల రోజులపాటు సమ్మె చేస్తే ప్రభుత్వం స్పందించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసేందుకు అంగీకరించిందని సిబ్బంది చెబుతున్నారు. అప్పట్లో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహించే వారిని క్రమబద్ధీకరించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సదుపాయాలను కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరించి సమ్మె చేయడం జరిగింది. పలు దఫాలు నిర్వహించిన చర్చల్లో ప్రభుత్వం ఐకెపి సిబ్బంది డిమాండ్లలో కొన్నింటిని అమలు చేసేందుకు హామీ ఇచ్చింది. అయితే హామీ ఇచ్చిన ప్రభుత్వం అమలు చేసే విషయంలో మాత్రం వెనుకంజవేసింది. తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న ఐకెపి సిబ్బందికి వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాల తరపున మద్దతు లభిస్తుంది. ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీ అమలుచేసే వరకు ఆందోళన విరమించుకోబోమని స్పష్టం చేస్తున్నారు. సిబ్బంది విధులకు గైర్హాజరు కావడం వలన గ్రామీణ ప్రాంతాల్లో ఐకెపి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు కొంత అంతరాయం ఏర్పడింది.

ఆర్టీసీ బస్సులో సైకో

తడ వద్ద ముగ్గురి వీకలు తెగ కోశాడు



సైకో పయనించిన బస్సు. ఇన్‌సెట్‌లో అతను ప్రాణాలు తీసిన ఓ ప్రయాణీకుడు.

భద్రాచలం నుంచి చెన్నై వెళ్తున్న బస్సులోని ముగ్గురు ప్రయాణీకులను దారుణంగా హత్యచేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించింది. 26వ తేది తెల్లవారుజామున బస్సు తడ వద్దకు చేరుకోగా బస్సులోనే ప్రయాణిస్తున్న వ్యక్తి అందులోని ముగ్గురిని అత్యంత పాశవికంగా చంపడం ఉలిక్కిపడేలా చేసింది. ఒంగోలుకు చెందిన ఉప్పలపాటి వెంకట నిరంజన్, ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన అజయ్ బిశ్వాస్, ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం కొర్రిపాటి పాళానికి చెందిన రాంబాబు ఈ ఘటనలో మృతి చెందారు. అందరూ నిద్రిస్తున్న సమయంలో హంతకుడు ఉన్నట్లుండి ఒకరి తర్వాత ఒకరిపై దాడి చేసి పదునైన ఆయుధంతో గుండెల్లో పొడవడంతో వారు అక్కడికక్కడే మరణించారు. జాదుల రమేష్ అనే వ్యక్తిపైన హత్యాప్రయత్నం చేయగా అతను తప్పించుకొన్నాడు. దీనిని అడ్డుకోబోయిన రాంబాబు మరణించడం విషాదం నింపింది. సంచలనం రేపిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, డిజిపి దినేష్‌రెడ్డి స్వయంగా ఆరా తీశారు. ఐజి హరీష్‌కుమార్ గుప్త, ఎస్పీ రమణకుమార్ తడలోనే వుండి హంతకుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. మొదట్లో ఇది సైకో పని అనుకొన్నా చివరకు నిర్ణయం మార్చుకొన్నారు. మానవుని శరీర భాగాల గురించి అవగాహన వున్న వ్యక్తి ఏఏ అవయవాలపై పొడిస్తే వెంటనే మరణిస్తారో తెలిసిన వ్యక్తే ఈ ఘాతుకానికి పాల్పడి వుండవచ్చని భావించిన పోలీసులు ఆ దిశగా విచారిస్తున్నారు. ఎందుకు ఇంతమందిని చంపారు. అతనికి టార్గెట్ ఎవరనే దానిపైనా దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం మీద ఈ హత్యలు బస్సు ప్రయాణీకులను వణికిస్తున్నాయి.

ఆరోగ్యశ్రీ ఎమ్మార్పీఎస్ ఘనత!



కావలి బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత మందా కృష్ణమాదిగ.

రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిది కాదని, అది తమ పోరాటాల ఫలితంగానే వచ్చిన పథకమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాకృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. వికలాంగులకు స్థానిక, చట్ట సభల్లో 7శాతం రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన యాత్రలో భాగంగా కావలికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలు వికలాంగులను విస్మరిస్తున్నాయని, వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో వికలాంగులకు ప్రభుత్వం 75 రూపాయలు పెన్షన్ ఇచ్చేవారని, తమ నాయకత్వంలో వికలాంగులతో ఉద్యమించడంతో ఆ మొత్తాన్ని 500 రూపాయలకు పెంచిందన్నారు. ఇప్పుడు ఆ పెన్షన్‌ను రద్దు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వికలాంగుల గృహాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదెకరాల భూమి వున్న రైతుకు 7గంటల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వగాలేనిది, నిస్సహాయులైన వికలాంగులకు ఉచిత విద్యుత్ ఇస్తే తప్పేమిటన్నారు. పంచాయితీ నుంచి పార్లమెంటు వరకు వికలాంగులకు 7శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ సభలో ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, రాంబాబు, వెంకటరమణయ్య, మందా వెంకటేశ్వర్లు, జెన్ని రమణయ్య, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● లంచమివ్వలేదని

ఆపరేషన్ మధ్యలో ఆపారట!

మానవత్వంలేని కావలి ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు

వైద్యులను దేవుడితో సమానంగా పూజిస్తుంటారు, గౌరవిస్తుంటారు. కానీ ఆ వైద్యులే లంచావతారం ఎత్తి అడిగినంత డబ్బు ఇవ్వలేదన్న నెపంతో ఆపరేషన్‌ను మధ్యలో నిలిపివేసి వైద్యరంగానికే మచ్చ తెచ్చేలా వ్యవహరించారు. కావలిలో స్థానిక ఏరియా హాస్పిటల్‌లో ఈ దారుణం జరిగింది. కావలి మండలం సర్వాయపాళెంకు చెందిన రూతమ్మ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. ఆమెను ఆపరేషన్‌కు తీసుకొనిపోయి మధ్యలో శస్త్రచికిత్స ఆపేశారు. మత్తు డాక్టర్‌కు వెయ్యి రూపాయలు ఇవ్వాలని, మందులు, పరికరాల కోసం మరికొంత మొత్తం చెల్లించాలని డాక్టర్ జయమ్మ డిమాండ్ చేసిందని వారు అడిగినంత డబ్బు ఇవ్వకపోవడంతో ఆపరేషన్‌ను మధ్యలో నిలిపివేశారని పేషెంట్ బంధువులు ఆరోపించారు. దీనిపై గగ్గోలు రేగడంతో వున్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కబెట్టడంతో మూడు గంటల తరువాత శస్త్రచికిత్స పూర్తి చేశారు. వైద్యులు మాత్రం పేగు దొరకనందు వల్ల ఆపరేషన్ మధ్యలో నిలిపివేశామని చెప్పారు. మొత్తం మీద ఈ వ్యవహారం లంచాల కక్కుర్తికి నిండుప్రాణాన్ని బలిపెట్టబోయిన డాక్టర్ల భాగోతాన్ని తెలియజెప్పింది.

బోగోలు, కావలిలో బీద తనిఖీలు



కావలి ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మస్తాన్‌రావు.

బోగోలు మండల కేంద్రం, కావలి పట్టణంలో స్థానిక శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు ఆకస్మిక తనిఖీలు జరపడంతోపాటు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సుందరిగిరివారి కండ్రిగలో బస్ షెల్టర్‌ను ప్రారంభించిన ఆయన అక్కడ నుంచి ఆకస్మిక తనిఖీలు చేశాడు. గత మూడు సంవత్సరాలుగా వర్షాకాలంలో ముంపు ప్రాంతంగా మారుతున్న బేతనిపేట కాలనీని సందర్శించి అక్కడి పరిస్థితులపై అధికారులతో మాట్లాడారు. ఇక్కడున్న ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యుత్ కోతల వలన విద్యార్థులు పడుతున్న అవస్థలను తెలుసుకొని బిఎంఆర్ ట్రస్టు తరపున ఇన్వర్టర్లు అందిస్తామన్నారు. కోవూరుపల్లి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వసతులు పెంచాలని అధికారులకు సూచించారు. బిట్రగుంట ఉన్నత పాఠశాలకు వెళ్లి టీచర్‌గా మారారు. పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. రాష్ట్రపతి, ప్రధాని ఎవరనేది సరిగ్గా చెప్పలేకపోవడంతో అక్కడే వున్న ఉపాధ్యాయులను పాఠ్యాంశాలతోపాటు జనరల్ నాలెడ్జ్ పెంచాలని చురకలంటించారు. అనంతరం ఆయన కావలి పట్టణంలోని వెంగళరావు నగర్‌లోని బిసి హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్న ఆయన పదవతరగతి పరీక్షల్లో 500 మార్కులు సాధించినట్లయితే ఒక్కొక్కరికి 5వేల రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. చదువులకు ఆటంకం కలుగకుండా వుండేందుకు హాస్టల్‌కు ఇన్వర్టర్‌ను, క్రీడాసామగ్రిని ఇస్తానన్నారు. ప్రభుత్వం చేస్తుందని ఎదురు చూడకుండా తనవంతు సహాయం చేయడంలోనే తృప్తి కల్గుతుందని చెప్పారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నేతలు పాల్గొన్నారు.

నేతల రాకతో తిప్పలు పడ్డ అధికారులు!

రైలు ప్రమాద బాధితుల సహాయ చర్యలకు ఇబ్బంది



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో కాలిన బోగీని పరిశీలించి వస్తున్న సిఎం.

తమిళనాడు ఎక్స్‌ప్రెస్ అగ్నిప్రమాద సంఘటన ప్రాంతాన్ని సందర్శించేందుకు రాజకీయ పార్టీల నేతలు పోటీ పడ్డారు. ఒకప్రక్క మృతదేహాలను బోగీ నుంచి వెలికి తీసి పోస్టుమార్టం జరిపేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా, మరోప్రక్క ప్రమాదానికి గల కారణాలను రైల్వే అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, చిరంజీవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షురాలు వై.ఎస్.విజయమ్మ, రైల్వే సహాయ మంత్రి మునియప్ప తదితరులు వివిధ మార్గాల ద్వారా నెల్లూరుకు చేరుకున్నారు. వీరి పర్యటనకు సంబంధించి కొన్ని గంటల ముందు జిల్లా అధికారులకు సమాచారం అందింది. దీంతో పోలీసు యంత్రాంగం విఐపిల పర్యటన బందోబస్తులో నిమగ్నం కావాల్సి వచ్చింది. జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు ఇతర ఉన్నతాధికారులందరూ కూడా రైల్వేస్టేషన్లోనే మకాం వేశారు. ఈ క్రమంలో విఐపిలు నెల్లూరుకు వస్తున్నట్లు సమాచారం అందడంతో వారికి అవసరమైన ఏర్పాట్లు చేయక తప్పలేదు. క్షతగాత్రులకు చికిత్స, మృతుల గుర్తింపు, శవపరీక్ష నిర్వహించే పనిలో సరైన దృష్టి సారించలేక పోయారు అధికారులు. ఎస్-11 బోగీలో వున్న మృతదేహాలను చూసేందుకు నగర ప్రజలే కాకుండా సమీప గ్రామాల ప్రజలు కూడా తరలి రావడంతో రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. వీరిని అదుపు చేయలేక రైల్వే, సివిల్ పోలీసులు నానా తంటాలు పడ్డారు.



నెల్లూరులోని కవిబ్రహ్మశ్రీ తిక్కనామాత్య సాహిత్య కవి – రచయితల సంఘం ఆధ్వర్యంలో వినుకొండకు చెందిన కవి దుబ్బల దానును సన్మానిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి. ప్రక్కన ఆచార్య ఆదిత్య, ఊరిబిండి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, దేవరాల సుబ్రహ్మణ్యం తదితరులు.




ఈటీవీలో ప్రసారమవుతున్న మనసు మమత సీరియల్ ఉత్తమమైనదిగా ఎంపికైన సందర్భంలో ఈ సీరియల్ స్క్రిప్ట్ కో ఆర్డినేటర్ నెల్లూరీయుడు జయంపుకృష్ణకు ఇచ్చిన నంది అవార్డు, జ్ఞాపిక.



ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నేతృత్వంలో వాకర్స్‌కు నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సి.భక్తవత్సలరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి. ప్రక్కన రాఘవేంద్రషెట్టి, బలరామయ్యనాయుడు.

కలువాయి దేశంలో కుమ్ములాటలు!



● కురుగొండ్లే కారకుడు

కలువాయి మండల తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు పొడచూపుతున్నాయి. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యవహార శైలి ఇందుకు కారణమన్న వ్యాఖ్యలు బలంగా విన్పిస్తున్నాయి. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడుతున్న నేతలను కాదని తన సామాజిక వర్గం వారికి పెద్దపీట వేస్తున్నారంటూ పలువురు టిడిపి నేతలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మండలపార్టీ కన్వీనర్ పదవిని స్థానికంగా వుంటూ ప్రజలకు, పార్టీకి అందుబాటులో వుండే వారికి కాకుండా నెల్లూరులో వుంటున్న రమణయ్యనాయుడనే వ్యక్తిని నియమించడం పట్ల పలువురు పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. అంతేకాకుండా మండలంలో పెత్తనం అంతా అదే సామాజిక వర్గం వారికి ఇవ్వడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వీరిలో కొందరు కలువాయి కాంగ్రెస్ నాయకులతో సన్నిహితంగా మెలుగుతున్నారని, మండలపార్టీ కన్వీనర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ నేత ఏపినాపి రాజా రెడ్డితో చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతున్నారని ఆరోపిస్తున్నారు. పార్టీ పరంగా కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలతో పోరాటం చేస్తున్న పరిస్థితుల్లో ఆ పార్టీ నేతలతో రాసుకపూసుక తిరిగితే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని సీనియర్లు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు చెలరేగుతున్నాయి. ఆరు నెలలకొకసారి వచ్చి అధికారుల పని తీరును విమర్శించడం తప్ప సొంత పార్టీలో విబేధాలను చక్కదిద్ద లేకపోతున్నాడనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి. ఎమ్మెల్యేకు బదులు ఆయన పిఏనే అందుబాటులో వుంటున్నాడని పలువురు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే మండల పర్యటనకు వచ్చినపుడు అసంతృప్తి నేతలంతా ఫోన్ స్విచ్ ఆపి కార్యక్రమాలకు దూరంగా వుంటుండడం ఎమ్మెల్యేకు, మండల నేతలకు మధ్య వున్న దూరాన్ని తెలియజేస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే పార్టీ మారాలన్న ఆలోచనలో వారు వున్నట్లు సమాచారం.

● పశువుల ఆస్పత్రి

ప్రారంభానికి కుదరని ముహూర్తం!

అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా వుంది కోవూరు పశువైద్యశాల పరిస్థితి. ఇక్కడ వుండే పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో శాంతినగర్‌లో 12లక్షల రూపాయలతో నూతన భవనాన్ని ఆస్పత్రి కోసం నిర్మించారు. ఈ నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఏదో ఒక ఆటంకాలు ఎదురౌతుండడంతో సంవత్సర కాలంగా ప్రారంభం వాయిదా పడుతూ వస్తోంది. ఇటీవల దీనిని ప్రారంభించ దలచినా ఉపఎన్నికలు రావడంతో అదీకాస్త అట్టకెక్కింది. ఇక

కోవూరులో ఎన్నాళ్లిలా!

అప్పటి నుంచి పశువుల ఆస్పత్రి ప్రారంభం గురించి ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో పాత ఆస్పత్రిలోనే వైద్యం చేస్తున్నారు పశువులకు. చిన్నపాటి వర్షానికే అంతా ఉరుస్తుండడంతో విలువైన మందులను, రికార్డులను కాపాడుకొనేందుకు సిబ్బంది అవస్థలు పడాల్సి వస్తోంది. కొత్త భవనం ఏర్పాటైంది కదా ఇక సమస్యలు తొలగిపోయినట్టేనని అనుకొన్న సిబ్బందికి, రైతులకు ఆ అవకాశం లేకుండాపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాన్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుకొంటున్నారు.

ముంగమూరు రోడ్డుకు

మరమ్మత్తులెప్పుడు?

ఇబ్బందిపడుతున్న మూడు గ్రామాల ప్రజలు

బోగోలు మండలం ముంగమూరుకు వెళ్లే రోడ్డు శాశ్వత మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఏనుగుల బావి, ముంగమూరు, జడగోగుల గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతుంటారు. దీనికి కారణం పడమర వైపు నుంచి వాగుల ద్వారా వచ్చేనీరు ఈ గ్రామాలను చుట్టుముట్టడమే. చుట్టూ నీరు వచ్చి చేరుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు వెలుపలికి రావాలంటే ముంగమూరు రోడ్డు ఒక్కటే దిక్కు. మూడు కిలోమీటర్ల పాటు వున్న ఈ మార్గంలో రోడ్డు పూర్తిగా దెబ్బతినిపోయింది. వంతెనలు కూలిపోయి వున్నాయి. తూతూమంత్రంగా రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు అధికారులు. దీని వలన కాంట్రాక్టర్‌లకు జేబులు నిండడం తప్ప ప్రజలు ఇబ్బందులు తొలగడం లేదు. ప్యాచ్‌వర్క్ చేసినా కొద్దిరోజులకే తిరిగి యధాస్థితికి చేరుకొంటుడడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే హడలి పోతున్నారు వాహనాలపై వెళ్లే వాళ్లు. తమ సమస్యలపై ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులను పలుమార్లు కలసి విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు ఈ గ్రామ ప్రజలు.

సాంఘిక సంక్షేమ శాఖ డిడికి తీరిక దొరికింది!

బాలాయపల్లి హాస్టల్ తనిఖీ చేశారు

సాంఘిక సంక్షేమశాఖ జిల్లా ఉపసంచాలకులు విశ్వమోహన్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గంలోని వివిధ హాస్టళ్లను తనిఖీ చేయడం చర్చనీయాంశమయ్యింది. బాలాయపల్లి హాస్టల్ నుంచి మూడు బస్తాల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టుబడడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై ఎఎస్‌డబ్ల్యూఓ విచారణ జరిపారు. ఈ పరిస్థితుల్లో విశ్వమోహన్‌రెడ్డి హాస్టళ్ల తనిఖీకి రావడం ప్రాధాన్యత సంతరించుకొంది. బాలాయపల్లి మండలంలోని హాస్టళ్లను ఆయన రెండు రోజులు తనిఖీ చేశారు. బాలాయపల్లి, జయంపు, పిగిలాం ఎస్సీ బాలుర వసతి గృహాలతోపాటు ఓజిలి మండలం ఆరిమేనుపాడు హాస్టల్‌ను తనిఖీ జరిపారు. మెనూ అమలుపై విద్యార్థులతో ముచ్చటించిన ఆయన వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకొన్నారు. మొత్తం మీద విశ్వమోహన్‌రెడ్డి హాస్టళ్ల తనిఖీ చేయడం అక్కడి సిబ్బందిలో గుబులు పుట్టించింది.

అడ్డగోలు మునిసిపాలిటీ!

కావలిలో అధికారుల కిరికిరీ వర్ణించలేం!

ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, అక్రమ లేఅవుట్లు, అడ్డగోలు అనుమతులతో కావలి మునిసిపాలిటీ అస్తవ్యస్తంగా మారింది. వీటిని అరికట్టాల్సిన మునిసిపాలిటీ సిబ్బంది అక్రమార్కులకు అండదండలు అందిస్తుండడంతో అడిగేవారే లేకుండా పోయారు. సామాన్యులు వివిధ పనులపై మునిసిపల్ కార్యాలయానికి వెళితే సవాలక్ష ప్రశ్నలు వేసి రోజుల తరబడి తిప్పుకొనే సిబ్బంది తమ చేయి తడిపే వారికి మాత్రం ఆగమేఘాలపై పనులు చేసి పెడుతున్నారు. అడిగినంత ఇస్తే క్షణాల్లో ఫైలు కదులుతుంది. పనులు జరిగిపోతాయి. లేదంటే నెలల తరబడి తిరగాల్సిందే. ఏదో ఒక అడ్డుపుల్ల వేసి ఫైలు కదలకుండా చేస్తారు. ఇళ్లు కట్టుకోవాలని టౌన్ ప్లానింగ్ అనుమతి కోరితే వారు అడిగినంత ముట్టచెప్పాల్సిందే లేదంటే భవన నిర్మాణం జరగని పని. మరోవైపు బహుళ అంతస్తులను నిబంధనలకు విరుద్ధంగా కట్టిపారేస్తున్నా అటువైపే కన్నెత్తి చూడరు. వారితో లంచాల బంధం. ఇది మునిసిపాలిటీ అధికారుల లంచావతారం. ఇక ఇబ్బడి ముబ్బడిగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నా కళ్లుండి కబోదుల్లా వ్యవహరిస్తున్నారు మునిసిపాలిటీ సిబ్బంది. సామాన్యులు చిన్నపాటి గోడ కటినా, రోడ్డుపై ఇసుక వేసినా హడావిడి చేసే అధికారులు ఆక్రమణలు, అక్రమ లేఅవుట్ల వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలపాలవుతోంది.



పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న గోపాలమిత్రల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్వేపల్లి వెంకటేశ్వర్లు.



● వెంకటగిరి

బెటాలియన్ అభివృద్ధి చేస్తా!

..... కలెక్టర్ హామీ

వెంకటగిరి తొమ్మిదవ బెటాలియన్ ప్రగతికి తన వంతు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ శ్రీధర్ హామీ ఇచ్చారు. వెంకటగిరి పర్యటన సందర్భంగా వల్లివేడులోని బెటాలియన్‌ను సందర్శించారు. ప్రాంగణమంతా కలియ తిరిగిన ఆయన అక్కడ అందుతున్న వసతులను పరిశీలించారు. వైద్యశాలను, పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని, యూనిఫాం వంటి వసతులు కల్పించడానికి జిల్లా విద్యాశాఖాధికారితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. పాఠశాలకు అదనంగా మూడు తరగతి గదులను 15 లక్షల రూపాయలతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ పోలీస్ కుటుంబాల వారితో మాట్లాడారు. మహిళలు పొదుపు సంఘాల్లో చేరి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. బెటాలియన్ నిర్వహణపై కలెక్టర్ శ్రీధర్ సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల అక్కడ అధికారులు ఆనందపడ్డారు.

టీసి కావాలా... రూ700 ఇచ్చుకో!

విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు, కళాశాలకు వెళ్లాంటే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టిసి) అవసరం. ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులు అడిగిన ప్పుడు టిసిని ఇవ్వాల్సి వుంటుంది. అయితే సీతారాంపురంలోని కేరళ ఇంగ్లీషు మీడియం స్కూలు యాజమాన్యం ఇందులోను చేతివాటం ప్రదర్శిస్తోంది. విద్యార్థులకు టిసి ఇవ్వాలంటే 700 రూపాయల వరకు వసూలు చేస్తుండడం గగ్గోలు రేపుతోంది. నర్సరీ నుంచి ఏడవ తరగతి వరకు క్లాసులు

సీతారాంపురంలో కేరళ స్కూల్ వ్యాపారం.

నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ఫీజులు అధికంగా వసూలు చేస్తారన్న పేరుంది. కనీస సౌకర్యాలకు నోచుకోని ఈ పాఠశాల గురించి పలుమార్లు విద్యాశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాంటిది స్కూలు యాజమాన్యం టిసి ఇచ్చినందుకు బలవంతంగా 700 రూపాయలు వసూలు చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శల పాలవుతోంది.

వెంకటగిరిలో ఇళ్ల పట్టాల పంపిణీ!

ఘనత ఎమ్మెల్యే రామకృష్ణదే!

ఎట్టకేలకు వెంకటగిరిలో మూడవ విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు అధికారులు. స్థానిక శాసన సభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా ఈ పట్టాల పంపిణీ జరిపారు. గతంలో 790 మందిని గుర్తించగా ప్రస్తుతం 511 ప్లాట్లకు లేఅవుట్ వేశారు. ఇది జరిగి ఆరేళ్లు గడిచింది. అప్పటి నుంచి ఇంతవరకు పట్టాలు అందజేయకపోవడంతో ఇటీవల మాజీ కౌన్సిలర్ జానకి రామయ్య ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట లబ్దిదారులు ధర్నా చేశారు. ఆనాడు ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో వారు ధర్నా విరమించారు. ఎమ్మెల్యే చొరవతో ఇప్పటికి పట్టాలు పంచారు అధికారులు. ప్రస్తుతం 472 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. పార్టీ రహితంగా అర్హులందరికి పట్టాలు వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు కురుగొండ్ల. మూడో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఆదర్శ కాలనీ నిర్మించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. వాస్తవానికి రెండేళ్ల క్రిందటే 2010 సెప్టెంబర్ 12న నేదురుమల్లి దంపతుల చేతుల మీదుగా కొందరికి పట్టాలు పంచినా భూమిని గుర్తించి లేఅవుట్ వేయడంలోనే ఇంత జాప్యం జరిగింది. మొత్తం మీద ఆరేళ్ల తర్వాత అయినా పట్టాలు దక్కడంతో లబ్దిదారులు సంతోషపడ్డారు.

కావలి మునిసిపల్ మేనేజర్ బదలీ!

వివాదాస్పద అధికారి మరీ!

కావలి మున్సిపల్ మేనేజర్ తారక్‌నాథ్ ఆకస్మిక బదలీ చర్చనీయాంశమయ్యింది. వివాదాస్పద అధికారిగా పేరు తెచ్చుకొన్న ఆయన్ను బదలీ చేయాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేసినా, ఆందోళనలు చేపట్టినా స్పందించని ప్రభుత్వం వున్నట్లుండి బదలీ వేటు వేయడం మునిసిపాలిటీలో తీవ్రమైన చర్చకు దారి తీసింది. తారక్‌నాథ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన వ్యవహారశైలిపై పలు విమర్శలు తలెత్తాయి. వివాదాస్పద వ్యక్తిగా ముద్రపడ్డాడు. ఐదు నెలల క్రిందట మునిసిపల్ కార్యాలయ ఆవరణలో వాచ్‌మెన్ అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. ఆ వ్యక్తి మృతికి మేనేజర్ తారక్‌నాథ్ కారణమని మృతుని కుటుంబాలు, ప్రజా సంఘాలు ఆరోపించాయి. దీనికి కారణమైన ఆయనపై చర్యలు చేపట్టాలని పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి. వారెంత అరచి గోల చేసినా అధికారులు పట్టించుకోలేదు. మునిసిపల్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడిగా తారక్‌నాథ్ వుండడం, ఆయన సామాజిక వర్గానికి చెందిన పలువురు కావలి పట్టణంలో అధికారపార్టీ నేతలుగా వుండడంతో ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేక పోయారు. ఈ నేపథ్యంలో కొన్ని వారాలుగా కార్యాలయానికి రాకుండా వున్న ఆయన్ను బదలీపై చిత్తూరుకు పంపడం వెనుక అంతర్యం ఏమిటన్నది కావలిలో తీవ్రమైన చర్చకు తెరతీసింది.

కైవల్యానదిపై వంతెన

గూడూరు – మిట్టాత్మకూరు గ్రామాల మధ్య విందూరు గ్రామ సమీపంలోగల కైవల్యానదిపై బ్రిడ్జి నిర్మాణం కానుంది. దీని కోసం ఏడు కోట్ల రూపాయలతో ఆర్‌అండ్‌బి అధికారులు ప్రతిపాదనలు పంపారు. దశాబ్దకాలంగా ఇక్కడ బ్రిడ్జి లేకపోవడం వల్ల ఈ ప్రాంతాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. వర్షాలు పడినప్పుడు కైవల్యానది పొంగి ప్రవహిస్తుండడం వల్ల పలువురు ఈ నది దాటుతూ ప్రాణాలు కోల్పోయారు. పలుమార్లు బ్రిడ్జి నిర్మించాలని కోరినా ఫలితం లేకుండా వుండింది. ఇంత కాలానికి అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల క్రింద చదువులు!

డమ్మాయిపాళెం హైస్కూల్ దుస్థితి

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు విద్యను అందించడం తమ లక్ష్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు పదే పదే ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వుంటోంది. శిథిలమైన పాఠశాలల్లో బిక్కుబిక్కుమంటూ చదువుకొంటూ, సరిపడే తరగతి గదులు లేక చెట్ల క్రింద కాలక్షేపం చేయాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఇందుకు ముత్తుకూరు మండలం డమ్మాయిపాళెం హైస్కూలు ఉదాహరణ. ఈ పాఠశాలలో చుట్టుప్రక్కల ప్రాంతాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు మీద పడుతుందోనన్న ఆందోళనతో వున్నారు పిల్లలు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు పాఠశాల ఆవరణలో తిరుగుతున్నాయి. పందుల సంచారం అధికంగా వుండడం, చెట్ల క్రిందే చదువుకోవాల్సిరావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే విద్యార్థుల సమస్యలు చెప్పనవసరం లేదు. కృష్ణపట్నం హైస్కూలు, ముత్తుకూరు హైస్కూళ్ల పరిస్థితీ అధ్వాన్నంగా వుంది. ఈ పాఠశాలలకు పంపించాలంటేనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల అవస్థలను గుర్తించి వాటిని పరిష్కరించాలని కోరుకొంటున్నారు మండల ప్రజలు.

కంప్యూటరీకరించాలంటే చేతులు తడపాలి!

విఆర్ఓలా మజాకానా?

ఎంకిపెళ్లి సుబ్బిచావు కొచ్చిన చందంగా మారింది పాసుపుస్తకాలు కంప్యూటరీకరణ చేయాలన్న నిర్ణయం. భూముల వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు తావు లేకుండా వుండేందుకు జిల్లాలోని భూముల వివరాలన్నింటిని కంప్యూటరీకరించాలని భావించారు అధికారులు. ప్రభుత్వ ఆలోచన సరైనదే అయినా రెవెన్యూ అధికారుల తీరు వలన పాసుపుస్తకాల కంప్యూటరీకరణ అవినీతిమయమైంది కావలి డివిజన్‌లో. ఈ ప్రాంతంలో గల 18 మండలాలకు సంబంధించిన భూముల వివరాలన్నింటిని ఆర్‌డిఓ కార్యాలయంలో కంప్యూటరీకరిస్తున్నారు. ఈ పనికి ప్రైవేట్ ఆపరేటర్లను వినియోగిస్తున్నారు. వారికి ఆ పని చేసినందుకు డబ్బులు చెల్లించాల్సి రావడం రెవెన్యూ సిబ్బందికి సమస్యగా మారింది. ఆయా మండలాల తహశీల్దార్లు ఈ బాధ్యత వహించాల్సి రావడంతో వారు ఈ భారాన్ని విఆర్ఓల మీద పెట్టారు. వీరు వెళ్లి గ్రామాల్లోని రైతుల నుంచి పాసుపుస్తకాలను కంప్యూటరీకరణ చేస్తున్నందుకు డబ్బులు దండుతుండడం పట్ల గగ్గోలు రేగుతుంది. అడిగినంత ఇస్తే పాసుపుస్తకాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తామని లేదంటే కష్టమని చెప్పి రైతుల నుంచి డబ్బులు అడుగుతున్నారట. ఇటీవల తహశీల్దార్ల బదలీలు జరగడంతో ఈ వ్యవహారం గందరగోళంగా మారింది. ప్రభుత్వ నిర్ణయానికి రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సబబు అన్న దానికి డిఆర్ఓ సమాధానం చెప్పాలి.



శ్రద్ధాంజలి

మా అమ్మగారైన
శ్రీమతి శెట్టిపల్లి కొండమ్మ గారు
తేది 05-07-2012 గురువారం
స్వర్గస్తులైనారు. వారి ఆత్మకు శాంతిని
కలగచేయమని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కీ॥శే॥ శెట్టిపల్లి కొండమ్మ గారు
కడనూతల, బోగోలు మండలం

S.మల్లి, BA., BL.,
అడ్వకేట్, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు
వి.యన్.ఆర్ పేట, బోగోలు. సెల్ : 94404 64245

ఆ ఘోరాన్ని చూడలేము!

మొదటి పేజీ కొరవ

పెట్టె ఎలా తగలబడింది?

రెండంటే రెండు నిముషాలలో ఒక రైలు పెట్టె తగలబడి, అందులోని ప్రయాణీకులు మాడి మసై పోవడం సాధ్యమా? ఆ పెట్టెలో నిప్పు ఎట్లా పుట్టింది? ఎప్పుడు పుట్టింది? దాన్ని ప్రయాణికులు ఎందుకు గమనించలేకపోయారు? ఎమర్జెన్సీ డోర్ల సదుపాయాన్ని కానీ, ఒక పెట్టె నుంచి వేరొక పెట్టె లోకి పరుగెత్తే వీలున్న వెస్టిబుల్ సౌకర్యాన్ని కానీ ఎందుకు వినియోగించుకోలేక పోయారు? రెండు నిముషాల ముందు రైల్వే స్టేషన్‌లో కన్పడని మంటలు ఎట్లా పుట్టుకొని వచ్చాయి? అంతే వేగంగా ఎట్లా వ్యాపించాయి? ప్రయాణీకుల ఆర్తనాదాలు పక్క పెట్టెలో వుండేవారికి ఎందుకు విన్పించలేదు? కనీసం అదే పెట్టెలో మంటలు వ్యాపించని భాగంలో వుండేవారు ఎందువల్ల ప్రమాదాన్ని గుర్తించలేకపోయారు? అంతా మిస్టరీగా వుంది ఈ ప్రమాదం. చాలా ప్రశ్నలకు, అనుమానాలకు సమాధానం దొరకడం లేదు.




మరణ మృదంగ బోగి ఎస్-11 నుంచి సగం కాలిపోయిన శవాలను బయటికి తీస్తున్న రెస్క్యూ టీం.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నారాయణ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు.



నెల్లూరు రైల్వే స్టేషన్‌లోనే ఏర్పాటు చేసిన మార్చురీలో శవాల పోస్టుమార్టం చేస్తున్న డాక్టర్లు.



ముందు షార్ట్ సర్క్యూట్ అన్నారు!

రైల్వే అధికారులు ముందుగా షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని ప్రకటించారు. అది నిజమైతే, షార్ట్ సర్క్యూట్ జరిగిన వెంటనే మంటలు అంటుకోవు. కొద్ది సేపు పొగ రావాలి. మరణించిన ప్రయాణీకులలో అధిక సంఖ్యాకులు పొగ పీల్చడం వల్లనే చనిపోయి వుంటారని పోస్టుమార్టం చేసిన డాక్టర్లు ప్రాథమికంగా చెప్తున్నారు. పొగ ఒకటి రెండు నిముషాలలో వ్యాపించేది కాదు. గంట లేదా కనీసం అరగంట ముందు పొగ పుట్టి మెల్లమెల్లగా పెట్టెను క్రమ్మి వుండాలి. అంత సేపు పెట్టెలో పొగ వస్తుంటే ప్రయాణీకులెవరికీ మెలుకువ ఎందుకు రాలేదన్నది ప్రశ్న. ఈ వ్యవధిలో ఆ రైలు అధమ పక్షం అరడజను స్టేషన్లు దాటి వుంటుంది. ఒక్క స్టేషన్‌లోనైనా రైల్వే సిబ్బంది ఎందుకు గమనించ లేకపోయారు. అన్ని స్టేషన్లలో, అందరు సిబ్బందీ అజాగ్రత్తగా వుండరు కదా?

మరణానికి కారణం పొగ అయితే, ప్రయాణీకులు చెల్లాచెదురుగా పరుగెత్తాలి. ఎవరో ఒకరు అలారం చైన్ లాగి వుండాలి. కానీ అటువంటి ప్రయత్నమే జరిగిన సూచన లేదు. పైపెచ్చు తలుపు దగ్గర శవాల గుట్టపడి వుంది. ఆ శవాలన్నీ మాంసం ముద్దలుగా మారిపోయి వున్నాయి. అంటే శవం కాలేంత సమయం మంటలు వుండి వుండాలి. అదే జరిగితే అదే పెట్టెలోని మిగతా వారికి కానీ, పక్కనున్న పెట్టెలోని వారికి ఎందుకు తెలియలేదు? విజయమహల్ గేటు మ్యాన్ చూసే వరకు ఎందుకు ఆలస్యం జరిగింది?

ఫోరెన్సిక్ నిపుణుల వాదన వేరు!

షార్ట్ సర్క్యూట్ వాదన నమ్మశక్యంగా లేదని ఫోరెన్సిక్ నిపుణులు సందేహిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగితే బ్యాటరీలు, సర్క్యూట్ బ్రేకర్లలో కన్పిస్తుందట. కానీ అవి రెండూ సక్రమంగానే వున్నాయి. అందువల్ల షార్ట సర్క్యూట్ కాకపోవచ్చునని చెప్తున్నారు.

అది కానప్పుడు ప్రమాదం ఎట్లా జరిగింది ఎవరైనా బాంబు వంటిది పెట్టి పేల్చారా? బాంబు పేలిస్తే శబ్దం రావాలి. అది పేలిన చోట పెట్టె ధ్వంసం కావాలి. పెద్ద పెద్ద రంధ్రాలు పడాలి. కానీ ప్రమాదం జరిగిన పెట్టెలో అటువంటి ఛాయలు లేవు. ప్రమాదం జరిగిన సమయంలో అటువంటి శబ్దాలూ లేవు. ఏవో చప్పుళ్లు విన్నామని స్థానికులు చెప్పే మాటలకు విశ్వసనీయత లేదు. బాంబు పేలుడు జరిగి వుంటే ప్రయాణీకులు పొగతో మరణించరు. కేవలం కాలిన గాయాలతో చావాలి. పైపెచ్చు బాంబు పేలిన తర్వాత పడుకొన్న బెర్తులలో నుంచి లేచి, తలుపు వరకు పరుగెత్తే వ్యవధి వుండదు. బాంబు పేలుడు అంటే అంతా క్షణాలలో జరిగిపోయే విధ్వంసం. అందువల్ల దీన్ని విస్ఫోటంగా పరిగణించడానికి లేదు.

విద్రోహ చర్య ఎలా అంటారు?

మొదట షార్టసర్క్యూటు అన్న రైల్వే అధికారులు ఆ తర్వాత ప్లేట్ ఫిరాయించి, ఏదో విద్రోహ చర్య జరిగి వుండవచ్చునని ప్రకటించారు. విద్రోహ

కొరవ 14వ పేజీలో




రైలు పెట్టె దగ్ధ ఘటనా స్థలం వద్ద గుమికూడిన జనం.



'సైకో' ఫీవర్


నెల్లూరీయులకు మళ్లీ సైకో ఫీవర్ మొదలయ్యింది. ఆరు నెలలకు ముందు నెల్లూరు బాలాజీనగర్, కావలి ప్రాంతాల్లో సైకో 'సాంబ' చేసిన ఆగడాలు తలచుకొంటే నేటికీ మహిళలు, యువతులు వణికి పోతారు. అతడిని పట్టుకొన్నట్లే పట్టుకొని వదలిపెట్టిన మంగళగిరి పోలీసు లను ఇప్పటికీ మహిళలు తిట్టిపోస్తుంటారు. పాత ఘటనలు మరపుకు రాకముందే తడ వద్ద ఓ సైకో ఆర్టీసి బస్సులో ముగ్గురు ప్రాణాలు తీయడం చర్చనీయాంశమయ్యింది. ఈ కొత్త సైకో డాక్టర్లు ఆపరేషన్లు చేయను వాడే కత్తిని ఉపయోగించడం వల్ల ముగ్గురు ప్రయాణీకులు నిశ్శబ్దంగా తల వాల్చేశారని ఫోరెన్సిక్ నిపుణుడు డాక్టర్ శశికాంత్ తేల్చి చెప్పారు. కేరళ లోని మరో సైకో ఆంటోని ప్రమేయం ఈ హత్యలలో వుందా? ఎవరైనా ప్రేమలో వైఫ ల్యం చెందినవారు లేదా డాక్టర్ ఎవరైనా ఈ పనికి పాల్పడ్డారా అనే రకరకాల పుకార్లు నెల్లూరంతా షికార్లు చేస్తున్నాయి. పిచ్చివాళ్లను, మందుబాబులను సైకోలుగా ఎంచి చావగొట్టే స్థాయికి 'సైకో ఫీవర్' వెళ్లిపోయింది.



దొడ్ల డైరీ దైవసేవ!


నెల్లూరుకు సమీపంలోని 'దొడ్ల' డైరీ నిర్వాహకులకు దైవసేవ చేసే భాగ్యం లభించింది. తిరుమలలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఈ ఏడాది నెయ్యి, పాలు సర ఫరా చేసే కాంట్రాక్టు దొడ్ల డైరీ చేతికి వచ్చింది. స్వామి నిత్యాభిషేకాలు, రకరకాల సేవలు, భోజన పథకంలోనూ దొడ్ల డైరీ నెయ్యి, పాలనే ఇక నుంచి వాడతారు. లాభం ప్రాతిపదికనగాక సేవా ప్రాతిపదికన బిడ్ దాఖలు చేయడం వల్ల పలు పేరుగాంచిన సంస్థలు ఈ టెండర్లలో పాలు పంచుకొన్నా ఏడు కొండల స్వామి తమకు నెయ్యి, పాలు రూపంలో సేవ చేసే భాగ్యం కల్పించాడని 'డైరీ' యాజ మాన్యం మురిసిపోతోంది.

అరచి గోల చేస్తున్నారు!



సినిమాల్లో అశ్లీలాన్ని అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైన ఫిలిం సెన్సార్ బోర్డు సిగరెట్, మందు తాగే సన్నివేశాలు తెరపై వచ్చినప్పుడు ఇవి తాగడం హానికర మని సబ్ టైటిల్ క్రింద వేయడం ప్రేక్షకులు గమనించే వుంటారు. గత రెండు నెలలుగా విడుదలవుతున్న చిత్రాల్లో ఇటువంటి సన్నివేశా లుంటే సినిమా ప్రారంభానికి ముందు, విశ్రాంతి ముందు, విశ్రాంతి తర్వాత సిగరెట్ తాగడం, మద్యాన్ని సేవించడం ఆరోగ్యానికి హానికరమంటూ 'వాయిస్ ఓవర్' చెప్పిస్తున్నారు. సినిమాలో విశ్రాంతికి ముందు మినహా మిగతా రెండు చోట్లా ప్రేక్షకులకు బొమ్మ కనపడక నీతులు వినిపిస్తుండేసరికి సహనం కోల్పోతున్నారు. క్లాస్, మాస్ హాళ్లనే తేడా లేకుండా ఈ వాయిస్ ఓవర్ విన్పించగానే అరచి గోల చేస్తున్నారు. తమ మంచికే ఈ విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నా వినే ఓపిక ప్రేక్షకులకు లేదు మరి! ఏం చేస్తాం?

భళా సిపిఎం పోరాటం!



సిపిఎం పేరు వింటేనే రకరకాల పోరాటాలు కళ్ల ముందు కదలాడుతుంటాయి. నగరంలోని డ్రైనే జీలు శుభ్రం చేయాలని, దోమలను చంపే ఆయిల్ బాల్స్ కాల్వ లలో వేయాలని ఆ పార్టీ నేతలు మాటిమాటికి నొక్కి వక్కాణిస్తుం టారు. కాని నగరంలో ఎద్దలరేవు సంఘం సమీపంలోని సిపిఎం జిల్లా కార్యాలయం ముందు, ఉత్తరం వైపు వర్ణించలేనంత చెత్తా చెదారం పేరుకొన్న డ్రైనేజీలున్నాయి. ఈ డ్రైనేజీలను శుభ్రంగా వుంచేలా కార్పొరేషన్‌పై సిపిఎం పోరాటం చేయడం లేదు. పార్టీ ఆఫీసు ముందు మురుగును శుభ్రం చేయించలేని నాయకులు ఊరంతా శుభ్రం చేయమని పోరాటాలకు దిగడాన్ని ఏమందాం?


సౌభాగ్యాన్నిప్రసాదించే మంగళగౌరీ వ్రతం



మహారుషులు వారి అనుభవాల నుంచి, వారి మేధస్సు నుంచి, తపస్సు నుంచి సకల మానవాళి శ్రేయస్సును వాంఛించి కొన్ని సూత్రాలు చెప్పారు. వాటినే మనం శాస్త్రాలుగా భావించి అనుసరిస్తున్నాం. ఇవి ఏ ఒక్కరి కోసమో కాక అందరికి ఉప యోగపడేవిగా వుంటాయి. భారతీయ సంస్కృతి ఎన్ని యుగాల నుంచి వున్నా నేటికి కొత్తగా వుండడానికి కారణం ఆచార సాంప్రదాయాలే. ఇలాంటి వాటిలో నోములు, వ్రతాలు వున్నాయి. వీటి అంతరార్థం లోకకళ్యాణం. శ్రావణ మాసంలో ఆచరించే వ్రతాలు, నోముల్లో మంగళవారం నాడు చేసే మంగళ గౌరీ వ్రతం ఎంతో శ్రేష్టమై నది. అమ్మలగన్న అమ్మ అయిన మూలపుటమ్మను గౌరీదేవిగా భావిస్తూ సకల సంపదలు, సకల ఐశ్వర్యాలు కలగాలని, జీవితాంతం సుమంగళిగా వుండాలని కోరుకొంటూ మహిళలు ఆచరించే వ్రతమే మంగళ గౌరీ వ్రతం. నోము నోచిన యువతి ఐదు మంది ముత్తైదువులకు వాయనం ఇవ్వాల్సి వుంటుంది. పండు, తాంబూలం, పిం డితో చేసిన ప్రమిదలో వెలిగించిన దీపంతోపాటు శనగలను వాయనంగా ఇస్తారు. నోమునోచిన స్త్రీ ముత్తైదువులకు వాయనం ఇస్తూ ఇస్తినమ్మ వాయ నం అని, దానిని స్వీకరించే వారు పుచ్చుకొం టినమ్మ వాయనం అని అంటారు. నా వాయ నానికి అధిపతి ఎవరమ్మా అని అడిగితే వాయ నం తీసుకొనే ఇల్లాలు నేనే గౌరీ దేవినని చెప్తుంది. దీనిలోని అంతరార్థం ప్రతి మనిషిలోనూ భగవం తుని స్వరూపాన్ని చూడడమని అర్థం. ఈ వ్రతం ఆచరించడం వలన అమంగళాలు హరించబడి నిండు సౌభాగ్యం కల్గుతుందని పురాణాలు చెప్తు న్నాయి.

ఈ వ్రతాన్ని మంగళవారం నాడు ఆచరించ డానికి కారణం మంగళవారానికి అధిపతి అయిన కుజుడితో మంగళగౌరీ వ్రతం ముడిపడి వుం డడమే. సాధారణంగా కుజగ్రహ దోషం కారణం గానే భార్యాభర్తల మధ్య కలహాలు, వివాహానికి ఆటంకాలు, ఘర్షణలు, అనుకోని ఆపదలు సంభ విస్తూ వుంటాయి. వీటి నుండి బయటపడాలంటే మంగళగౌరీ వ్రతమే శరణ్యం. భూమి పుత్రుడైన కుజుడు మంగళగౌరీ దేవి అనుగ్రహంతోనే మంగళవారానికి అధిపతి అయ్యాడని చెప్తారు. అంతటి మహత్తు కలిగిన మంగళగౌరీ వ్రతాన్ని మొదట సూతమహర్షి శౌనకాది మునుల ద్వారా సర్వమానవాళికి అందించాడు. ఈ పరాశక్తిని పూజించే, ఆ అమ్మ అనుగ్రహంతోనే రుక్మిణి దేవి, పార్వతిదేవి వారుకోరుకొన్న భర్తలను పొందగలి గారని పురాణాల ద్వారా తెలుస్తోంది. నైమిశార ణ్యంలో సూతమహర్షి మునులకు ఈ వ్రత కథను వివరిస్తుండగా నారదమునీంద్రుడు సావిత్రిమాతకు ఉపదేశించాడని, శ్రీకృష్ణ పరమాత్మ ద్రౌపది దేవికి వివరించి ఆమెచేత చేయించాడని పురాణ కథనం. వ్రత కథలో సుశీల అల్పాయుష్ముడైన భర్తకు పూర్ణాయుష్షు పొందడమే కాక, తన అత్త మామల కంటి చూపును మంగళగౌరీ వ్రతంతో పొందగలుగుతుంది. అందుకే ఈ వ్రతంలో కాటుక అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొంది. వ్రతం చేసిన పడతి వాయనంతోపాటు కాటుకను కూడా ముత్తయిదువులకు పంచుతుంది. మంగళగౌరీ వ్రతం చేసిన వాళ్లు వైధవ్య బాధ లేకుండా నిండు సౌభాగ్యంతో అలరారుతారని, సకల శుభాలు కలుగుతాయని పురాణాలు చెప్తున్నాయి.

ఎన్నాళ్ల కెన్నాళ్లకు...



ఎన్నాళ్ల కెన్నాళ్లకు అని సినీ కవి వేటూరి సుందరరా మ్మూర్తి అడవిరాముడు సినిమాలో వ్రాసిన పాటను గుర్తుకు తెచ్చారు జిల్లా అధికారులు. ముఖ్యమంత్రి 27తేది వేకువన ఈ రోజు రాత్రికి జిల్లా అధికారులంతా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నిద్ర చేసి సమస్యలు తెలుసుకోవాలని హుకుం జారీ చేశారు. తాను కూడా ఈ రాత్రి శ్రీకాకుళం జిల్లా సీతంపేట హాస్టల్‌లో నిద్ర చేశారు. సిఎం తొలిసారిగా ఇచ్చిన ఉత్తర్వును కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తోపాటు మరో 48 మంది అధికారులు పాటించి హాస్టళ్లలో నిద్ర చేశారు. కాని పరిష్కారమైన సమస్యలేమిటో ఆ హాస్టల్ విద్యార్థులకే ఎరుక!



చేపట్టిన పనులలో ఆదాయానుకూలతలుంటాయి. ఇంటాబయట మీ మాటకు విలువిస్తారు. ఇంటియందు వివాహాది శుభ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులు అధికారిక వ్యవహారాలలో సంయమనం పాటించాలి. వృత్తి, వ్యాపార రంగాలలోనివారు క్రొత్త పెట్టుబడులకు అధిక ప్రాధాన్యతనిస్తారు. బాకీలు వసూళ్ళవుతాయి. ఆదాయం బాగున్నా అధిక ఖర్చులుంటాయి.



అన్ని వర్గాలకు ప్రోత్సాహకరంగా వుంటుంది. కుటుంబ సభ్యులతో వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు. వారసత్వ విషయాలలో సంయమనం పాటించాలి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహం, గుర్తింపు పొందుతారు. కొన్ని విషయాలకు దూరంగా వుండడం మంచిది. విద్యార్థులకు ప్రోత్సాహకరమైన వారం. వ్యవసాయదారులకు అవసరానికి ఋణ సదుపాయం లభిస్తుంది.



శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువుల సేకరణ, బంధుమిత్రుల కలయిక ఆనందాన్నిస్తుంది. మీ గౌరవ ప్రతిష్టలకు భంగం రానీయకండి. వృత్తి, వ్యాపారాలలోని వారు బాగా శ్రమ పడాలి, ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి. విద్యార్థులకు శుభప్రదం. వ్యవసాయదారులకు ఆదాయం వున్నా శ్రమ తప్పదు. కళా, క్రీడా రంగాలలోని వారు వివాదాస్పద విషయాల్లో లౌక్యంగా వ్యవహరించాలి.



చేపట్టిన పనులు పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలోని వారు చేసే నూతన ఆదాయ మార్గాలకు అనుకూలతలున్నాయి. నూతన వ్యక్తులతో జాగ్రత్తలు పాటించండి. ఖర్చులు నియంత్రించుకోవాలి. విద్యార్థులు శ్రమకు మించి ఫలితాలు పొందగలరు. వ్యవసాయదారులకు ఆర్థికాదాయం బాగుంటుంది. కళా, క్రీడా రంగాలలోని వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరంగా వుంటుంది.



వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాలలోనివారు ఆర్థికాదాయంపై దృష్టి పెట్టినా ఖర్చులధికం. అవసరానికి ఋణం చేయవలసి వస్తుంది. ఇంట్లో భార్యాపిల్లలతో ఇబ్బందులు. విద్యార్థులకు అనుకూలతలున్నా ఉన్నత విద్యకు రెండో ప్రయత్నం చేసుకోవడం మంచిది. ఉద్యోగులకు పై అధికారులతో అనుకూలత అవసరం. వ్యవసాయదారులు కీలక నిర్ణయాలు తీసుకొని ఆదాయం పొందగలరు.



పనులలో శ్రమాధిక్యం వున్నా ఫలితాలు మరోవిధంగా వుంటాయి. నిర్ణయం తీసుకోవడంలో లోపం వల్ల నిరుత్సాహం పొందగలరు. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఆర్థిక విషయాలు అశాంతినిస్తాయి. ఉద్యోగులకు స్థానమార్పులకు అధికారుల సహకారం వున్నా అడ్డంకులు ఏర్పరచేవారుంటారు. గోప్యపు వ్యవహారాలు ఉపకరిస్తాయి. విద్యార్థులకు బాగుంటుంది. రాజకీయులు విమర్శలెదుర్కొంటారు.

వారఫలాలు

తేది 4-08-2012 నుండి 10-08-2012 వరకు వృషభంలో గురు, కేతువులు; మిథునంలో శుక్రుడు; కర్కాటకంలో రవి, బుధులు; కన్యలో కుజుడు; తులలో శని; వృశ్చికంలో రాహువు; కుంభ, మీన, మేషాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

5తేది సంకష్ట చతుర్థి.
9తేది స్మార్త – మాధ్వ శ్రీకృష్ణ జన్మాష్టమి.
10తేది గోకులాష్టమి, దశ ఫల వ్రతారంభం.


శుభ ముహూర్తాలు

4,5 తేదిలలో వివాహాలకు.
8తేది అన్నప్రాసన, వివాహ, గృహారంభ, క్రయ విక్రయాది శుభకార్యాలకు మరియు సాధారణ శుభకార్యాలకు సుముహూర్తాలున్నాయి.

ఆగష్టు తిథులు
శ్రావణ బహుళ

4	శని	విదియ	ఉ	06.16 గం.ల.వ
5	ఆది	తదియ	ఉ	05.52 గం.ల.వ
6	సోమ	చవితి	ఉ	06.11 గం.ల.వ
7	మంగళ	పంచమి	ఉ	07.14 గం.ల.వ
8	బుధ	షష్ఠి	ఉ	08.58 గం.ల.వ
9	గురు	సప్తమి	ప	11.09 గం.ల.వ
10	శుక్ర	అష్టమి	ప	01.39 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



అన్ని రంగాలవారికి చేపట్టిన కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా వుండి, ఆర్థికంగా మేలనిపిస్తుంది. ఇంట్లో శుభకార్యప్రయత్నాలు ఫలిస్తున్నా, బంధువర్గాలు మిమ్మల్ని దూరంగా వుంచుతాయి. వృత్తి, వ్యాపారాల లోనివారు నూతన ప్రయత్నాలు వాయిదా వేయడం మంచిది. వ్యవసాయదారులకు ఆశించిన ఆదాయం రాకపోవచ్చు. రాజకీయాల లోని వారు సభలు, సమావేశాల నిర్ణయాన్ని వాయిదా వేయండి.




అన్ని రంగాలలోనివారు అన్ని విషయాలలో అనుకున్నది సాధిస్తారు. ఆర్థికాదాయం బాగున్నా, కొన్ని విషయాలలో ఇతరులను దూరంగా వుంచండి. ఉద్యోగులకు ప్రతికూలతలుంటాయి. వృత్తి, వ్యాపారాలు బాగుంటాయి. గతంలో నిలిచిన పనులు తిరిగి పూర్తిచేస్తారు. విద్యార్థులకు నూతన అవకాశాలు మెరుగౌతాయి. కళా, క్రీడా రంగాలలోని వారు అనుకూలతలు సాధిస్తారు. గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి.



ఇంట్లో శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ వ్యక్తుల సంతోషం కోసం అదనపు వ్యయాలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలోని వారికి మానసిక చీకాకులు, ప్రయాణాల వల్ల శారీరక అలసట వుంటుంది. చిన్న పనికైనా పెద్ద ప్రయత్నం అవసరం. ఆదాయ వ్యయాలు సమానం. వ్యవసాయ రంగంలోని వారు ఆర్థిక విషయాలలో ప్రణాళిక ప్రకారం విజయం సాధిస్తారు. రాజకీయులకు ప్రోత్సాహకరం.



ఇంట్లో శుభకార్యయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో సఖ్యత బాగుంటుంది. నూతన భాగస్తులతో వ్యాపారాలు ప్రారంభించే సూచనలున్నాయి. ఇంట్లో పెద్దల ఆరోగ్య విషయాలు కలవర పెడతాయి. అవసరానికి డబ్బు చేతికందుతుంది. ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు బాగుంటుంది. వ్యవసాయదారులు చేపట్టే నూతన మార్పులు, చేర్పులు అనుకూలిస్తాయి.



తలపెట్టిన అన్ని ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంట్లో జరిగే శుభకార్యాలకు నూతన వస్తువులు సమకూర్చుకొంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వృత్తిపరమైన వారికి ఆర్థికాదాయ లోపం. నూతన వ్యక్తుల పరిచయాలుంటాయి. వ్యవసాయదారులు సకాలంలో డబ్బు చేతికందక ఇబ్బందిపడతారు. కళా, క్రీడా రంగాలలోని వారి ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి.



అన్ని విషయాలలో అనుకూలం. అయితే ముఖ్య పనులు వాయిదా వేయడం మంచిది. ఇంటాబయట వ్యతిరేకత వుంటుంది. మీ కోపతాపాలు అదుపులో వుంచాలి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలో సామాన్యతలుంటాయి. సంతానానికి శుభాలు కల్గడం సంతోషాన్నిస్తుంది. అధిక ఖర్చులకై అవసరార్థం ఋణ సౌకర్యం గూర్చి ఆలోచిస్తారు. వ్యవసాయదారులకు గతంలోకన్నా మేలనిపిస్తుంది.

'పరితోలిందము', 'చంక్రమణము' ఏకార్థ ప్రయోగమే!

టి.వసంతకుమార్ యాదవ్ చెన్నై

** శాస్త్రాధ్యయనంలో పరితోలిందం, చంక్రమణం పదాలు నన్ను తికమక పెట్టాయి?*

ఇంటికి ముందు, వెనకలలోనూ, కుడి, ఎడమ పార్శ్వాలలోనూ వరండాలు ఉండడాన్ని ద్వాదశాష్ట వాస్తు శాస్త్రాలు పై రెండు పేర్లను చెబుతున్నాయి. రెండింటికీ అర్థం ఒకటే!

డాక్టర్ ముఖేష్‌శాస్త్రి సికింద్రాబాద్

** మీరు 'హోరాల్డ్ క్యాంపెన్' పుస్తకాన్ని గురించి విన్నారా?*

వారు జ్యోతిష శాస్త్రాన్ని అందునా భారతీయ శాస్త్రాన్ని అమితంగా అభిమానిస్తారు. పాశ్చాత్యులైనప్పటికీ "ద యండ్ అండ్ మిస్టరీ" పుస్తకం చదివాను. వారు 2011 నుంచి భూమి దుర్దశ ప్రారంభమౌతుందని చెప్పారు. కాలుష్యాల పట్ల మనిషి నిర్లక్ష్యమే భూమి అంతానికి సూచిక.

ఎల్‌వి.రెడ్డి కావలి

** ఇంటికి వెనుక, ప్రక్క వైపు వంట కాలువ లుండవచ్చా?*

గృహానికి, వ్యాపార సంస్థకు పశ్చిమ దక్షిణాల్లో కాలువలు అరిష్టం. వరుణ, యమస్థానాల వల్ల దుష్ప్రభావాలుంటాయి.

వి.ఎన్.శకుంతలారెడ్డి చెన్నై

** 'మాంగల్య బల నిర్ధారణ' చేస్తానని అతను నమ్మకంగా చెప్తున్నాడు.*

ఇలాంటి ఆషాఢభూతుల మాటలు నమ్మకండి. గృహస్థ హిందూ వైవాహిక ధర్మసూత్ర శాస్త్రాల్లో ఈ విషయమై ప్రస్తావనలు లేవు. మోసగాళ్లని నమ్మకండి.

అశోక్‌రెడ్డి పెనుగొండ

** సంఖ్యా శాస్త్రం ప్రకారం కొన్ని అక్షరాలు తగ్గించుకొంటే మహర్దశ వస్తుందన్నారు.*

ఆ శాస్త్రం శాస్త్రీయత ఇంకా నిర్ధారణ కాలేదు. ఆంగ్ల అక్షరాలలోని కొన్నింటిని పీకేసి, అతికించినంత మాత్రం ఏమీ వరగదు. పుట్టిన తేదీ, సమయాలకే ప్రాధాన్యత.

ఎన్.సి.ధర్మారావు తిరుపతి

** యంత్ర ప్రతిష్ఠ, పూజ చేయించాను అయినా ప్రయోజనం లేదు.*

చిత్తశుద్ధి, నిబద్ధత మీలో లేవని మీ ఆరోపణల ఉత్తరం చెబుతోంది. నమ్మకం దివ్యౌషధం అన్నది సైంటిస్టుల మాట. మీ మానసిక పరిస్థితి వల్ల సమస్యల్ని కొని తెచ్చుకుంటారు.

బి.శుభప్రద నెల్లూరు

** తూర్పు, పశ్చిమ గృహ ఫోటోలు పంపిస్తున్నాను. నాకెందుకో అనుమానం వచ్చింది.*

మంచి పని చేశారు. తూర్పు, పశ్చిమ దిశాలోపాల వల్లే మగపిల్లలు, యజమాని భ్రష్టులవుతారు. ఉత్తరంలో వ్రాశా అలా సరిచేసుకోండి. శీతల యంత్ర ప్రతిష్ఠ కొంత మేలు చేస్తుంది.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

ఆర్‌వి.రెడ్డి భద్రాచలం

** శుక్రవారం కలసి వస్తుందట? నవగ్రహ శాంతులు చేయించమన్నారు.*

నమ్మకం వున్నప్పుడు నవగ్రహ ప్రదక్షిణలు చేయండి. ఏ రోజు కలిసి వస్తుందో చెప్పడం కష్టం. ఇలాంటివి సోమరితనానికి పునాదులు వేస్తాయి. ఎప్పటి పనిని అప్పుడే చేయడం మంచిదని 'వశిష్ఠ ధర్మ సూత్రం' చెబుతోంది.

బషీర్ అహ్మద్ బొంబాయి

** స్థలం నూటఇరవై డిగ్రీలున్నది. మంచిదేనా?*

ఇలాంటి స్థలాన్ని 'కోణాకృతివేధో దృష్టి' స్థలాలంటారు. ఇవి ఆర్థిక, అనారోగ్య దుష్ప్రభావాల్ని కలిగిస్తాయి. నరఘోష యంత్రం కొంత మేలు చేస్తుంది.

బి.ఉమాకాంతారావు శ్రీకాళహస్తి

** సెప్టిక్ ట్యాంకుల వల్ల అంత ప్రమాదమా?*

మీ ఇంట్లో వాయువ్యం సెప్టిక్ ట్యాంక్ ఉన్నది. మానసిక క్షోభ, కుటుంబ సమస్యల్ని గురించి ఉత్తరంలో మీరెంతగానో వాపోయారు కదా? ప్రభావ ప్రమాదాలిలాగే వుంటాయి.


డి.ఎలిజబెత్ సికింద్రాబాద్

** 'ఆత్మ' దేవుణ్ని శాస్త్రాలు ఎలా వర్ణిస్తున్నాయి? మీ అభిప్రాయం ఏమిటి?*

శరీరం, ఆత్మలు వేరు వేరు. ఆత్మ పరమాత్మ ఆజ్ఞ ప్రకారం వర్తిస్తుందని విశ్వామిత్ర మహర్షి తన 'జ్ఞాన సంహిత'లో వివరించారు. రష్యన్ శాస్త్ర వేత్తలు శక్తివంతమైన కెమెరాలతో 'ఆత్మను' ఫోటోలు తీశారు. అది బొటన వ్రేలంత ఉంటుందంటున్నారు. ఆత్మ సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను.

ఖజానా కార్యాలయంలో ప్రక్షాళన జరిగేనా?

ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రతి బిల్లు ఖజానా కార్యాలయానికి వెళ్లి మంజూరు కావాల్సిందే. ఆన్‌లైన్ చెల్లింపులున్నా ముందు ఖజనాధికారులు ఓకే చేయాలి. దీంతో ప్రతి బిల్లు మంజూరుకు వీరు కొంత శాతం కమీషన్ అడగడాన్ని మానడం లేదు.



నెల్లూరులోని ట్రెజరీ ఆఫీసు.

రాష్ట్ర ప్రభుత్వశాఖలకు సంబంధించి వివిధ రకాల బిల్లులు, ఉద్యోగుల జీత భత్యాలు మంజూరు చేయడంలో ఖజానాలు కీలకపాత్ర పోషిస్తుంటాయి. నేరుగా ప్రభుత్వశాఖలకు నిధులు విడుదల చేసినప్పటికి ఖజానా నుంచి అనుమతి పొందిన తర్వాతనే బ్యాంకు నుంచి నగదు డ్రాచేసే అవకాశముంటుంది. వివిధ శాఖల నిధులు బ్యాంకు నుంచి డ్రా చేసే అధికారం ఇస్తే దుర్వినియోగం జరుగుతాయన్న వుద్దేశంతో ట్రెజరీలను ఏర్పాటు చేశారు. ఖజానా కార్యాలయ ఉద్యోగులు సైతం ప్రభుత్వ ఉద్యోగులమన్న విషయం పూర్తిగా మరచిపోయి తోటి ఉద్యోగులను కమీషన్ల కోసం డిమాండ్ చేస్తుంటారు. కుటుంబ అవసరాలను తీర్చుకోవాల్సి రావడంతో ట్రెజరీ అధికారులు, సిబ్బంది అడిగినంత సొమ్మును వారికి ముట్ట జెప్పి బిల్లులు మంజూరు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కమీషన్ల వసూలు చేయడం ట్రెజరీల్లో ఎన్నో సంవత్సరాలు నుంచి కొనసాగుతోంది.

అటెండర్ నుంచి ఉన్నతాధికారి వరకు ట్రెజరీల్లో కమీషన్లు తీసుకుంటున్న విషయం తెలుసు. అయినా కూడా దీనిని నియంత్రించేందుకు ఏ అధికారి కూడా ఇప్పటివరకు ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. ఆన్‌లైన్ ద్వారా ప్రతి బిల్లు, ఉద్యోగుల జీతాలు మంజూరు చేస్తున్నప్పటికి ఏదో ఒక కొర్రీ పెట్టి బిల్లులను పెండింగ్‌లో ఉంచుతున్నారన్న ఆరోపణలున్నాయి. రెవెన్యూ సర్వీసెస్, ఎస్టీఓ సంఘంలో ట్రెజరీ ఉద్యోగులు సభ్యులుగా వుంటున్నారు. ఈ సంఘాలకు చెందిన నేతలు, సభ్యులు ప్రభుత్వ శాఖల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయినా బిల్లులు మంజూరు చేయాలంటే తప్పనిసరిగా శాఖాపరంగా కమీషన్ మొత్తం అందజేయాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు కాకుండా, పంచాయితీరాజ్, జిల్లా పరిషత్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, రోడ్లు, భవనాలశాఖ, మునిసిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖల్లో కాంట్రాక్టర్లు చేసిన పనులకు సైతం ట్రెజరీల ద్వారానే బిల్లులు మంజూరు చేయాల్సి వుంటుంది.

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు లక్షల్లో వుంటాయి. వీటికి కూడా 10శాతం వంతున కమీషన్ తీసుకొని మంజూరు చేస్తుంటారు. ఖజానా కార్యాలయంతోపాటు ఉప ఖజానా కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇటీవల స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అంగన్‌వాడి వర్కర్లకు గత సంవత్సరం కేంద్రం 1500 వందల రూపాయలు వేతనం పెంచడం జరిగింది. పెంచిన వేతనం ఈ సంవత్సరం విడుదలైంది. వీటిని బ్యాంకు నుంచి డ్రా చేసి అంగన్‌వాడి వర్కర్ల ఖాతాల్లో జమ చేసేందుకు 10 శాతం కమీషన్ వసూలు చేశారు. జిల్లాలో 3వేల మందికి పైగా అంగన్‌వాడి వర్కర్లు వున్నారు. ఒక్కొక్కరికి 9వేల వంతున ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సిడిపిఓలు వసూలు చేశారు. ట్రెజరీ అధికారులకు ఇవ్వాలని సాకుగా చూపి ఈ వసూళ్లకు పాల్పడ్డారు. కమీషన్ వసూలు చేసిన సిడిపిఓ, సూపర్‌వైజర్లు ఈ విషయాన్ని బహిర్గతపరిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరికలు చేసినట్లు కొందరు అంగన్‌వాడి వర్కర్లు వాపోయారు. మరో నెలలో పెంచిన వేతనం 9వేలు అందించనున్నారు. దీంట్లో కూడా కమీషన్ తీసుకొనే అవకాశం వుంది. ఈ తతంగం జిల్లాలోని అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో జరుగుతోంది. వర్కర్లను భయపెట్టడం ఎంతవరకు సమంజసమో ఆ శాఖ అధికారిణులకే తెలియాలి. నగరంలోని ఖజానా కార్యాలయంలో పోలీసులకు సంబంధించి బిల్లులను మంజూరు చేసేందుకు ట్రెజరీ డిప్యూటి డైరెక్టర్ నాగమాంబ తన ఇంటికి స్పిట్ ఎసి కావాలని, నెల నెలా తన కారుకు 50 లీటర్ల డీజిల్ పట్టమని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై నేతలు పోలీసు తెలివితేటలు ఉపయోగించి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. లంచం అంటే గిట్టని ఎస్పీ డిడి గురించి చెప్పిన మాటను విని ఆగ్రహించారట. వెంటనే డిడి విషయాన్ని రాష్ట్ర డిజిపి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ ద్వారా తెలియపరిచారు. ఎస్పీ లేఖపై వెంటనే స్పందించిన ఆర్థికశాఖ 24 గంటలు గడవక ముందే డిడి నాగమాంబను జిల్లా నుంచి బదలీ చేసింది. ఇలాగే ప్రతి ప్రభుత్వశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది బిల్లులపై ప్రత్యేక దృష్టి సారించి ట్రెజరీ అధికారుల అవినీతి గురించి స్పందిస్తే మేలు చేసిన వారవుతారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అవినీతిపై చర్చ జరుగుతున్న సమయంలో అవినీతిని ప్రోత్సహించడం ఎంతవరకు న్యాయమో అధికారులకే తెలియాలి.

ఫలితమివ్వని సదస్సులు

● *తూతూ మంత్రంగా...*

మహిళా, శిశు చైతన్య సదస్సులు!

జిల్లాలో జూలై 23వ తేది నుంచి 27వ తేది వరకు స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా చైతన్య సదస్సులు జరిగాయి. కానీ ఈ సదస్సులు దేనికోసం ఏర్పాటు చేశారన్న విషయాన్ని మహిళలకు చెప్పే విషయంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు.

స్త్రీ, శిశు సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత నెల 23 నుంచి ప్రారంభమైన మహిళ, శిశు చైతన్య సదస్సులు 27వ తేదితో ముగిశాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసిడిఎస్) ద్వారా ఈ చైతన్య, అవగాహన సదస్సులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 17 ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లోని 3315 అంగన్‌వాడి కేంద్రాల్లో వీటిని నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 24వ తేది గ్రామస్థాయి, 25వ తేది పంచాయితీ పరిధిలో, 26, 27 తేదీలలో మండలస్థాయిల్లో చైతన్య సదస్సులు ఏర్పాటుచేసే విధంగా ముందుగా ప్రణాళిక రూపొందించారు. ఇంతవరకు బాగానే ఉన్నా మహిళా, శిశు చైతన్య, అవగాహన సదస్సుల ఉద్దేశం, సంకల్పం, లక్ష్యాలు ఏమిటన్న దానిపై అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన లేకుండా పోయింది.

ముందుగా వీటి నిర్వహణపై వర్కర్లకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేసిన సంబంధిత శాఖ అధికారిణులు అవగాహన కల్పించలేక పోయారు. కేవలం సెల్‌ఫోన్ ద్వారా అంగన్‌వాడీ వర్కర్లకు సమాచారం అందించి విద్యార్థుల చేత గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. పై అధికారుల ఆదేశాలు పాటించాల్సి రావడం వలన అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులు, గ్రామంలోని కొందరు మహిళలను ప్రాధేయపడి ర్యాలీ నిర్వహించాల్సి వచ్చింది. కొన్ని ప్రాజెక్టుల పరిధిలో సూపర్‌వైజర్లు ర్యాలీలో పాల్గొని వెంటనే వెళ్లిపోయారు. సిడిపిఓ, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటుచేసి సదస్సులో పాల్గొని ఈ కార్యక్రమం ఉద్దేశం వివరించేందుకు కృషి చేయాలి. ఇటువంటి ర్యాలీలు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నెలకోసారి నిర్వహిస్తూనే ఉంటారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చైతన్య, అవగాహన సదస్సుల్లోనూ పౌష్టికాహారం గురించి నాలుగు మాటలు చెప్పారు తప్ప అంతకు మించి మహిళలకు వివరించలేక పోయారు.

కొన్ని గ్రామాల్లో, పంచాయితీ పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లే ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ముగించారు. సూపర్‌వైజర్లకు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ముందస్తు సమాచారం అందించినా సమయం చాలదని చెప్పి దుమ్మా కొట్టారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఐదు రోజులు అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి.

వర్కర్లపై ఆర్థిక భారం

చాలీచాలని గౌరవ వేతనంతో జీవనం సాగిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు మహిళా, శిశు చైతన్య, అవగాహన సదస్సుల పుణ్యమా అంటూ మరింత ఆర్థిక భారం మోయాల్సి వచ్చింది. గ్రామస్థాయిలో, పంచాయితీ పరిధిలో ర్యాలీలు, సదస్సులు ఏర్పాటు చేయాల్సి రావడంతో వచ్చిన మహిళలకు బిస్కెట్లు, టీ అందించారు. ఫోటోలు తీయించారు. 500 రూపాయల నుంచి 1000 రూపాయల వరకు ఖర్చు చేశారు. ర్యాలీలు నిర్వహించినట్లు పత్రికలకు సమాచారం అందించడంతోపాటు ఫోటోలు ఇవ్వాలన్న షరతు విధించారట సూపర్‌వైజర్లు.

అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించిన ఆ శాఖ అధికారిణులు ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అందుకయ్యే ఖర్చును భరిస్తుంది. అయితే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు మాత్రం నిధుల ఊసే ఎత్తకుండా వర్కర్లే భరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికి పౌష్టికాహారం అందక అనేకమంది చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అనారోగ్యం పాలవుతున్నారు. 14, 15 సంవత్సరాలకే బాలికలకు వివాహం జరుగుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు, పౌష్టికాహారం ప్రక్కదారి పడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. సూపర్‌వైజర్లు వారికి కేటాయించిన కేంద్రాలను సక్రమంగా తనిఖీలు చేయడం లేదు. దీంతో కేంద్రాలను మూతవేసి స్వంత పనులు చక్కబెట్టుకుంటున్నారు అంగన్‌వాడీ వర్కర్లు.

ముందుగా సూపర్‌వైజర్లకు ఐసిడిఎస్ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించాలి. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన వారు కార్యాలయానికే పరిమితమై పర్యవేక్షణ చేయడం పూర్తిగా మరచిపోయారు. ప్రతి నెల నివేదికలు తయారు చేసుకోవడం తప్ప వాస్తవ పరిస్థితులను పరిశీలన చేయడం లేదు. ముఖ్య ఉద్దేశాలను ప్రక్కనపెట్టి తూతూ మంత్రంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తే ఎటువంటి ప్రయోజనం కలగదన్న విషయాన్ని మరచిపోకూడదు.



కాజల్ భలే బిజీ!

హీరోయిన్ కాజల్ భలే బిజీ అయ్యింది. ప్రస్తుతం కాజల్ చేతిలో వున్న సినిమాలెన్నో తెలుసా? తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషలు కలుపుకొని 8 చిత్రాల్లో నటిస్తుందామె. అయితే అసలు సమస్య కూడా ఇక్కడే మొదలైంది. కాల్షీట్లు సర్దుబాటు చేయలేక ఆమె ఒత్తిడికి గురవుతోందని సినిమా వర్గాలు చెబుతున్నాయి. ఆమె అందుబాటులో లేకపోవడం వల్లే రెండు తమిళ చిత్రాల షూటింగ్‌లో జాప్యం చోటుచేసుకొందని సమాచారం. సూర్య హీరోగా ఓ చిత్రంలో నటిస్తోంది. అలాగే విజయ్‌తోనూ ఓ చిత్రం చేస్తోంది. సూర్య సినిమాను ఆగష్టులో విడుదల చేయాలనుకొన్నారు. అయితే హీరో, హీరోయిన్లపై కొన్ని సన్నివేశాలు తీయాలి. కాని కాజల్ విదేశాల్లో వుంది. దీనివల్ల సెప్టెంబర్ నెలకు కూడా ఈ చిత్రాన్ని విడుదల చేయలేమని నిర్మాత భావిస్తున్నాడు. విజయ్ సినిమా సైతం దసరా నుంచి దీపావళి పండుగకు విడుదల తేది మారింది. బాద్‌షా, సారొస్తారు, చరణ్, మహేష్ హీరోలుగా నటించే చిత్రాలను కాజల్ తెలుగులో ఒప్పుకొని వుంది.



ఎన్టీఆర్ ఏడు గెటప్పులు!

బాద్‌షా చిత్రంలో ఎన్టీఆర్ ఎలా కనిపించబోతున్నారు? ఈ విషయం గూర్చి ఆయన అభిమానులు తెగ చర్చించుకొంటున్నారు. ఇటీవల కొడాలి నాని తెలుగుదేశం పార్టీని వీడిన సందర్భంగా ఎన్టీఆర్ నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కొత్త హెయిర్ స్టైల్‌తో కనిపించారు. ఇది సైతం ఆ చిత్రంలో ఓ గెటప్ తాలుకు హైర్‌స్టైల్. మొత్తం మీద బాద్‌షాలో ఆయన ఏడు రకాల గెటప్పుల్లో కనిపిస్తాడట. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఇటలీలో జరుగుతుంది. కాజల్ హీరోయిన్. శ్రీనువైట్ల దర్శకుడు. గబ్బర్‌సింగ్ ఫేం బండ్ల గణేష్ నిర్మాత. తమన్ స్వరాలు కూరుస్తున్న ఈ చిత్రంలో కాజల్ ఓ పాట పాడుతుంది.

ఉద్యోగం చేస్తుండేదాన్ని!




అలర్జీకి చికిత్స చేయించుకొని విదేశం నుండి చెన్నై వచ్చిన హీరోయిన్ సమంత అరడజను చిత్రాల్లో నటించను ఒప్పుకొంది. ఆమె ఇప్పటి వరకు నటించిన సినిమాలన్నీ విజయవంతం కావడంతో ఆమెకు క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. ఆటోనగర్ సూర్య షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడుతూ 'దూకుడు' సమయంలో హీరో మహేష్ బాబు ఓ మాట చెప్పారు. ప్రతి సినిమా నీ మొదటి సినిమాగా భావించు అని. అదే పాటిస్తున్నాను. చదువు కొనే రోజుల్లో పుస్తకాల పురుగును. సినిమాల్లోకి రాకుండా వుంటే కచ్చితంగా ఏదో ఒక ఉద్యోగం చేస్తుండే దాన్నని వివరించింది.

కత్రినా బెల్లీ డ్యాన్స్!



నృత్యం, నటనరాని హీరోయిన్ అంటూ కెరీర్ మొదట్లో విమర్శకు గురైన కత్రినాకైఫ్ సుడి తిరిగింది. ఆమె ఈ మధ్య నటించిన ప్రతి సినిమా విజయవంతమైంది. నర్తించిన ప్రతి ఐటెంపాట సూపర్ హిట్టయ్యింది. షీలా కీ జవానీ, చిక్నీ చమేలీ పాటల్లో స్టెప్పులు క్లాస్, మాస్‌ను ఉర్రూతలూగించాయి. ఇప్పుడీమె సల్మాన్‌ఖాన్ హీరోగా తయారవుతున్న 'ఏక్‌ధా టైగర్' చిత్రంలో ఓ పాటకు బెల్లీ డ్యాన్స్ చేయనుంది. మాషా అల్లా చరణంతో మొదలయ్యే పాటలో బెల్లీడ్యాన్స్ చేస్తే బాగుంటుందని నిర్మాతలు అడగానే ఆమె ఓకే అని డ్యాన్స్ నేర్చుకొని నర్తించిన తీరు చూసి ఆమె గురువు ఫరాఖాన్, హీరో సల్మాన్‌ఖాన్ సైతం ఆశ్చర్యపోయారట. ప్రేక్షకులు సైతం చప్పట్లు కొడుతారంటుంది కత్రినాకైఫ్.

కష్టపడితేనే ఫలితం!



తివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో జులాయి సినిమాలో నటించడం ఆనందంగా వుందన్నాడు హీరో అల్లుఅర్జున్. ఈ విషయమై వివరిస్తూ జల్సా సినిమా చూసాక ఆయన దర్శకత్వంలో నటించాలని ఫిక్స్ అయిపోయా! హీరోలను ఆయన తెరపై చూపే తీరు కొత్తగా వుంటుంది. విజయాల్ని ఆస్వాదించాలి. తప్పుల నుంచి నేర్చుకోవాలి. ఇదే నా ఫిలాసఫీ. పరిశ్రమలో వున్న పోటీని స్ఫూర్తిగా తీసుకోవాలి. పరుగు పందెంలో వున్నప్పుడు గెలవాలంటే బాగా పరిగెట్టాల్సిందే. కష్టం ఒక్కటే ఇక్కడ మాట్లాడుతుంది. చిరంజీవిగారి ప్రభావం నాపై చాలా వుంది. ఆయన అభిలాష చిత్రంలో డ్యాన్స్ చేసిన 'నవ్వింది మల్లె చెండూ' పాట నాకు బాగా ఇష్టం. నేను ఈ పాట రీమేక్‌లో డ్యాన్స్ చేస్తా. అది ఏ సినిమాలో అనేది ఇప్పుడే చెప్పలేనన్నాడు.



చిత్ర సమీక్ష

✍ అల్లూరు రహీం

హీరో మంచు మనోజ్ పరిశ్రమలో నిలదొక్కుకోను నానాపాట్లు పడుతున్నాడు. నేను మీకు తెలుసా, మిస్టర్ నూకయ్య చిత్రాలు మొదలుకొని 'ఊ... కొడతారా ఉలిక్కిపడతారా' వరకు విభిన్న కథాంశాలతో చిత్రాలు తీయను ప్రయత్నిస్తున్నాడు. కానీ ఆయన ప్రయత్నాలు సఫలం కావడం లేదు. పాత కథకు కాసింత మెరుగులుదిద్ది సాంకేతిక అంశాలు జోడించి మనోజ్‌ను హీరోగా ఆయన సోదరి లక్ష్మీప్రసన్న నిర్మాతగా వ్యవహరించి తీసిన 'ఊ... కొడతారా ఉలిక్కి పడతారా' చిత్రం ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టు లేదు. ఈ చిత్రం ట్రైలర్స్ చూసి సినిమాకు వెళ్లిన వారికి చివరకు నిరాశ మిగులుతుంది. ఈ చిత్రం కోసం ఆరున్నర కోట్ల రూపాయలు వెచ్చించి గంధర్వమహల్ అనే సెట్టింగ్ వేశారు. ప్రతినాయక లక్షణాలుండే నాలుగు గెటప్పులతో మంచు మనోజ్ కనిపిస్తాడు. ప్రేక్షకులకు డబుల్ ధమాకా అంటూ బాలకృష్ణను ఒక ప్రత్యేక పాత్రలో కనిపించేలా చేశారు. కానీ ఆయన స్థాయికి తగ్గట్లు ఈ పాత్రను మలచలేకపోయారు. నాలుగేళ్లుగా ఈ చిత్రం గూర్చి కలలుగని విభిన్నంగా కనిపించను మనోజ్ నానాపాట్లు పడినా ప్రేక్షకులు ఊ... కొట్టక పోవడం ఉలిక్కి పడకపోవడానికి కొన్ని కారణాలున్నాయి. వాటిలో ప్రముఖమైనది హీరో క్యారక్టర్ గందరగోళంగా మలచడం. బాలకృష్ణను ప్రేతాత్మలా చూపిన విధానం ఆకట్టుకోలేదు. లక్ష్మీప్రసన్న వికారపు గెటప్, పాటల చిత్రీకరణలో రాజశేఖర్ కెమెరా ఎంత సేపూ హీరోయిన్ ఉరువుల మీద నిలపడం. రుద్రమనేని వంశానికి వారసుడనని చెప్పే బాలకృష్ణ డైలాగులు పలికితే మాస్ మంత్రముగ్దులవ్వాలి. కానీ లక్ష్మీ భూపాల్ వ్రాసిన మాటలు దీనికి సహకరించలేదు. మటన్ షాపులో కసాయి మటన్ ముక్కలను కొట్టినట్లు హీరో శవాలను ముక్కలు చేయడం తెలుగు సినిమాకు తగిన సన్నివేశమా అని దర్శకుడు ఒకసారి ఆలోచిస్తే బాగుండేది. ప్రధమార్థంలో సాగిన బిగువు చిత్రం ద్వితీయార్థంలో లేకుండా పోయింది. ప్రేతాత్మలుగా మారిన బాలకృష్ణ, సోనూసూద్, లక్ష్మీప్రసన్నల ఫ్లాష్‌బ్యాక్‌లు చూడలేక ప్రేక్షకులు ఇబ్బంది పడతారు. అయితే ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాల టేకింగ్ బాగుంది. ఈ సినిమాను తమిళం, ఇంగ్లీషులోనూ కాసిన్ని మార్పులుచేసి విడుదల చేస్తానంటున్న మనోజ్ తెలుగులో బోరింగ్ సన్నివేశాలను ఎత్తివేస్తే మంచిది. హీరో అఘోరా తరహాతోపాటు, తిట్టు కవిత్వంతో సాగే రెండవ పాట పరవాలేదనిపిస్తాయి. చిత్రంలోని గ్రాఫిక్స్ కూడా ఉన్నతంగా ఉంటే బాగుండేది.

చిత్రకథలోనికి వెళ్తే రుద్రమనేని వంశానికి వారసుడు నరసింహరాయుడు(బాలకృష్ణ) మాటకు జమీందారీలు కొనసాగిన కాలంలో తిరుగుండదు. తండ్రికి మాటిచ్చినట్లు ఆయన తన చెల్లెల్ని భూపతి(సోనూసూద్)కు ఇచ్చి పెళ్లి చేయడంతోపాటు వారసత్వంగా వచ్చిన గంధర్వ మహల్‌ను సైతం వ్రాసిస్తాడు. కానీ నీచుడైన భూపతి వేశ్య సంతతికి చెందిన అమృతవల్లి(లక్ష్మీప్రసన్న) కోసం తన భార్యను చంపేస్తాడు. చెల్లెలి శవం చూడను వచ్చిన నరసింహ రాయుడిని అవమానిస్తాడు. కాశీ వెళ్లి చెల్లెలు అస్థికలు గంగలో కలిపి వచ్చేసరికి అమృతవల్లితో పెళ్లికి సిద్ధమవడంతో భూపతిని నరసింహరాయుడు చంపేస్తాడు. ఈ పోరాటంలో నరసింహరాయుడిని సైతం భూపతి తన కత్తికి బలి తీసుకొంటాడు. దీంతో గంధర్వమహల్ వైభవం కోల్పోతుంది. నరసింహరాయుడు కుమారుడు రాయుడు(ప్రభు) ఈ మహల్‌ను పలువురికి అద్దెకిచ్చి ఆ డబ్బుతో బతుకుతుంటాడు. కొందరు అద్దెలివ్వక ఏడ్పించుకుతింటున్న సమయంలో మనోజ్(మనోజ్) అక్కడకు వస్తాడు. తన గూర్చి అతిగా చెప్పి భయపెట్టి అద్దెలివ్వని వారిని బయటకు పంపుతాడు. రాయుడు చిన్న కుమార్తె జగద (దీక్షాసేథ్)కు లైన్ వేస్తుంటాడు. ఇంతలో రాయుడు పెద్దమ్మాయి మధుమితకు పెళ్లి కుదురుతుంది. ఒక రోజు రాత్రి నరసింహరాయుడు తనకు దెయ్యంగా కనిపించాడని మనోజ్, రాయుడు ఉండే పెరటింట్లోకి వెళ్లి దాక్కొంటాడు. ఇంతలో పెళ్లి వారొస్తారు. పెళ్లికొడుకు మేనమామ బుజ్జి(సాయికుమార్) గంధర్వమహల్ కొట్టేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేయడంతో అతన్ని నరసింహరాయుడు ప్రేతాత్మ చావబాదుతుంది. ఇంతలో మాంత్రికుడు(అజయ్)ను తీసుకొస్తారు. ఆయన ఇంట్లో నరసింహరాయుడు, భూపతి ఆత్మలున్నాయని చెబుతాడు. రాయుడు ప్రేతాత్మ మంచి చేస్తుందని, భూపతి ప్రేతాత్మ గంధర్వమహల్‌లో పెళ్లి జరగనివ్వదంటాడు. ఈ సందర్భంగా రాయుడు, భూపతి ప్రేతాత్మలు హీరో మనోజ్, పెండ్లికొడుకు రుషి శరీరాల్లోకి ప్రవేశించి పోరాటానికి సిద్ధపడతాయి. అక్కడకు అమృతవల్లి వస్తుంది. ఇక ఎటువంటి ముగింపు ఉంటుందో ప్రేక్షకులకు చెప్పబని లేదు.



నాజ్ పరిపూర్ణ మహిళ పోటీలో గెలుపొందిన వల్లూరు ఉమను సన్మానిస్తున్న కలెక్టర్ సతీమణి ఉమాశ్రీధర్. ప్రక్కన వసంతలక్ష్మి, డాక్టర్ జయప్రద, నాజ్ అధినేత అనితాజైన్, డాక్టర్ జి.దివ్యారెడ్డి, పావనిలు ఉన్నారు.

నాజ్ పరిపూర్ణ మహిళ ఉమ!

విజయవంతంగా జరిగిన పోటీ

నెల్లూరులో పేరుగాంచిన బంగారంగడి నాజ్ షోరూం శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మొట్టమొదటి సారిగా నిర్వహించిన పరిపూర్ణ మహిళ పోటీలో మూలాపేటకు చెందిన వల్లూరు ఉమ ఈ టైటిల్‌ను గెలుచుకొన్నారు. 27వ తేది సాయంకాలం ఆచారివీధిలోని నాజ్ షోరూంలో ఈ పోటీ జరిగింది. 1658 మంది మహిళలు దర ఖాస్తు చేయగా పది మందిని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. వీరిపై వివిధ రంగాలకు సంబంధించిన ప్రశ్నలు సంధించగా ఉమ విజేతగా నిలిచారు. పరిపూర్ణ మహిళగా ఎంపికైన ఉమను బంగారు కుంకుమ భరిణె, పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించారు. మిగిలిన తొమ్మిది మం దికి కూడా పట్టువస్త్రాలు, నాజ్ మై షాపీ కార్డు, గిఫ్ట్‌హాంపర్లు బహుక రించారు. ఈ పోటీకి న్యాయనిర్ణేతలుగా నాజ్ జ్యూయలరీ మేనేజింగ్ డైరక్టర్ శ్రీమతి అనితా జైన్, జిల్లా కలెక్టర్ సతీమణి ఉమాశ్రీధర్‌రెడ్డి, ప్రముఖ గైనకాలజిస్ట్ సోమిరెడ్డి జయప్రద, దంత వైద్యురాలు డాక్టర్ జి.దివ్యారెడ్డి, బిల్డర్ పావని, వసంతలక్ష్మిలు వ్యవహరించారు. పోటీలో ఇంతమంది పాల్గొనడం పట్ల నాజ్ జ్యూయలరీ అధినేత లలిత్‌జైన్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో చెరకు రైతుల బకాయిలు పేరుకుపోతున్నాయి.

బకాయిలు చెల్లించండి

కోవూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయిలను వెంటనే అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డిలకు బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకో వాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. చక్కెర ఫ్యాక్టరీకి 2011 – 12 సీజన్‌కు సంబంధించి 800 మంది రైతులు లక్షా ఎనిమిది వేల టన్నుల చెరకును సరఫరా చేశారు. ఇందుకుగాను పది కోట్ల పది లక్షల రూపాయలను చెల్లించాల్సి ఉంది. రైతులు చెరకు సరఫరా చేసి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా బకాయిల చెల్లింపుకు అధికారులు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. చెరకు కటింగ్ చేసిన వెంటనే తిరిగి సాగు చేసేందుకు పెట్టుబడి అవ సరం అవుతుంది. బకాయిలు నిలిచి పోవడంతో రైతులు ఆర్థికంగా కూడా కొంత మేర ఇబ్బంది పడుతున్నారు. ఒక్కో రైతుకు లక్ష నుంచి రెండు లక్షల రూపాయలవరకు బకాయి చెల్లించాల్సి ఉంది. వీటిని పలుమార్లు అడిగినా చెల్లించే దిక్కు లేకుండా పోయింది.

వికలాంగులకు దొరకని ఉపాధి!

శ్రమ శక్తి సంఘాలకు పరుగులెత్తరేదు?

పలు సమస్యలతో సతమతం అవుతున్న వికలాంగులకు ప్రభుత్వం నుంచి తగిన సహా యం అందడంలేదని చాలాకాలంగా వికలాం గులు పోరాటం చేస్తున్నారు. దీర్ఘకాలంగా పరి ష్కారం కాని సమస్యలను ప్రక్కనపెడితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోనూ మొండిచేయి ఎదురౌతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్ట మైన ఆదేశాలు జారీచేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం వారికి ఉపాధి లభించడం లేదు. వికలాంగులు శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసుకొన్నా, నిబంధనల ప్రకారం వారికి కల్పించాల్సిన సులువైన పనులు లభించడం లేదు. జాబ్ కార్డుల మంజూరులోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో వికలాంగులకు ఉపాధి దొరకడం లేదు. జిల్లాలో మొత్తం 414 శ్రమశక్తి సంఘాలను వికలాంగులతో ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 9510 మందికి ఉపాధి హామీ పథకం క్రింద ఉపాధి లభించాల్సి ఉండగా 88 సంఘాల ద్వారా కేవలం 316 మందికి మాత్రమే అధికారులు ఉపాధినందిస్తూ చేతులు దులుపుకొంటుండడంతో వికలాంగులకు సరిగా పనిదొరకని పరిస్థితి ఎదురౌతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వికలాంగులను భాగస్వాములను చేయాలని, వారికి తేలికపాటి పనులు కేటాయించి ఉపాధి చూపాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అధికారుల అవినీతిని, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అది నెరవేరకుండా పోతోంది. వికలాంగులతో పనులు చేయించడం మొక్కుబడిగా మారింది. జిల్లాలో ఉపాధిహామీ పథకంలో కూలి పని చేయడానికి అర్హులైన వికలాంగులు ఉన్నా కొందరికి మాత్రమే జాబ్ కార్డులు ఉండడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనం. జిల్లాలో 46 మండలాల్లో 35వేలకు పైగా వికలాంగులున్నా స్వల్ప సంఖ్యలో ఉపాధి హామీ పథకం క్రింద ఉపాధి కల్పించడంతో పనికి దూరంగా అర్హులైన వికలాంగులు ఉండాల్సి వస్తోంది.

నీరుగారిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం

• పేరుకుపోయిన బకాయిలు

దళితులు, గిరిజన విద్యార్థులకు చక్కని విద్యను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్(బిఎఎస్) పథకం నీరుగారి పోతుంది. కానీ కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించుకొనేందుకు విముఖత చూపుతుండడంతో దళిత, గిరిజన పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. ప్రైవేట్ విద్యను విద్యార్థులకు అందించాలన్న ఉద్దేశంతో 1998లో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం క్రింద ఆయా విద్యార్థులకు ప్రభుత్వమే ఖర్చు భరాయించి ఎంపికచేసిన పాఠశాలల్లో చేర్పిస్తుంది. ఈ మొత్తంతోనే పిల్లలకు యూనిఫాంలు, భోజన వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. విద్యానగర్‌లోని బాల భారతి పాఠశాల, దర్గా మిట్టలోని సెయింట్ జోసెఫ్ స్కూల్, ఉస్మాన్ సాహెబ్‌పేటలోని రాఘవ స్కూల్, పొదలకూరులో చైతన్య స్కూలు, నారాయణరెడ్డిపేటలో సత్యసాయి పాఠశాలల్లో షుమారు 250 మంది వరకు విద్యార్థులు చదువుకొంటున్నారు. ఒక్కో విద్యార్థికి 18వేల రూపాయల నుంచి 20 వేల రూపాయల వరకు ఏడాదికి చెల్లిస్తున్నా ఆ ఫీజు తమకు గిట్టుబాటు కావడం లేదంటూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఈ పథకం క్రింద చేర్చుకొనేందుకు విముఖత చూపుతుండడంతో ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ఏర్పాటుచేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం నాన్ అవైలబుల్ స్కూల్స్ పథకంగా మారుతోంది. దీనిపై పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం ఫీజుల బకాయిలు పేరుకుపోయినందునే తాము పిల్లలను చేర్పించుకోలేక పోతున్నామని, అధికారులను ఎన్నిసార్లు అడిగినా బిల్లులు చెల్లించడంలేదని చెప్తున్నారు. అటు అధికారులు, ఇటు ప్రైవేట్, కార్పొరేట్ పాఠాశాలల యాజమాన్యాల వైఖరి కారణంగా దళిత, గిరిజన విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకోలేక పోతున్నారు.

విద్యుత్ కోతతో రొయ్యల రైతు విలవిల!

జిల్లాలో కరెంటు కోత కారణంగా రొయ్యలు సాగుచేస్తున్న రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. రొయ్యలసాగు ప్రారంభించిన తర్వాత కరెంటు కోత విధిస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో దాదాపు ఐదు వందల హెక్టార్లలో స్కాంపి రొయ్యలు, పన్నెండు వేల హెక్టార్లలో వెనామీ, టైగర్ రొయ్యలను సాగు చేస్తున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టి వీటిని సాగుచేస్తున్నారు. విద్యుత్‌కోత కారణంగా వెనామీ సాగులో ఏరియేటర్ పనిచేయకపోతే ఆక్సిజన్ అందక రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. లక్షల రూపాయలు ఖర్చుచేసి జనరేటర్‌లను కొనుగోలు చేయలేని చిన్న, సన్నకారు రైతులు కరెంటుపై ఆధార పడాల్సి వస్తుంది. 1990 సంవత్సరంలో రొయ్యల సాగుకు వైరస్ సోకడంతో భారీస్థాయిలో రైతులు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కోతలు విచ్చలవిడిగా అమలు చేస్తుండడంతో రొయ్యల సాగు చేయడం కష్టతరంగా మారింది. విద్యుత్ సరఫరా సక్రమంగా అందించకపోతే జిల్లాలో రొయ్యలు సాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన ప్రమాదంలో బాధితుల పరామర్శకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు చిరంజీవితో జంట ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డిలు.

బాబుకు ఊపిరి

16వ పేజీ కొరవ

అయితే జగన్ రాజీ వదంతులతో ఒక్క సారిగా పరిస్థితి మారిపోయింది. అదే కనుక జరిగితే అటు జగన్, ఇటు కాంగ్రెస్‌లు రెండూ ప్రజల ఆగ్రహానికి గురౌతాయని, ఆ పరిస్థితి తెలుగుదేశానికి అనుకూలంగా మారుతుందనే అభిప్రాయం ఏర్పడడంతో గోడ మీద పిల్లులు మెల్లగా మనసు మార్చుకోవడం మొదలు పెట్టారు. గుడివాడ, నూజీవీడు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపు తర్వాత పెద్ద ఎత్తున జరగవలసిన వలసలు నిలిచిపోయాయి.

ఇట్లా వెనకడుగు వేసినవాడిలో ముఖ్యుడు తలసాని శ్రీనివాసయాదవ్. ఆయన చాన్నాళ్ల నుంచే జగన్ ఇంటి వైపు తొంగి చూస్తున్నాడు. గోడ పక్క నుంచి ఒకటి రెండుసార్లు మాట్లాడాడు కూడా. అయితే కాంగ్రెస్ మంత్రి దానం నాగేందర్ ఆయన్ను నిలువరించాడు. అవసరం అంటూ వస్తే ఇద్దరమూ కలిసి వెళ్దాము, తొందరపడవద్దని ఆపుకొన్నాడు. నాగేందర్‌కు కూడా జగన్ గుడారంలో దూరి పోవాలన్న ఆలోచన వుందని వినికిడి. అయితే ఇప్పుడు తలసాని ఆలోచన మారిపోయింది. తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్‌తో జగన్ కలిస్తే జనం ఆదరించరనే అభిప్రాయంతో ఆయన పూర్తిగా వలస ఆలోచన మానుకొన్నాడట.

ఆంధ్ర ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వుంటాయనుకొన్న పార్టీ మార్పిడులు సైతం నిలిచిపోయాయి. దానితో చంద్రబాబు కొంత వూపిరి పీల్చుకోగల్గుతున్నాడు. కాంగ్రెస్, జగన్‌ల రాజీ వుందో లేదో తెలియదు కానీ ఆ పుకార్ల వ్యాప్తి వల్ల ఆయనకు గొప్ప లాభం కల్గింది.

జగన్‌కు మేలు

16వ పేజీ కొరవ

జైలుకు వచ్చి, ఆ తర్వాత అయిపు లేకుండా పోయారు. రాజీ ఫలితంగానే వారిని కేంద్ర ప్రభుత్వం వెనక్కు పిలిపించిందని అనుమానం. మరొక ప్రక్క జగన్ అక్రమ ఆస్తులుగా నిర్ధారించడానికి వీలైన బెంగుళూరు భవంతులు, లోటస్‌పాండ్ రాజసౌధాల వంటి భారీ పెట్టుబడులపై సిబిఐ ఇప్పటి వరకు ఛార్జిషీటు దాఖలు చేయలేదు. భారతీ సిమెంట్ లావాదేవీని సైతం పక్కన పెట్టింది. అందుకు కారణం – వాటికి సంబంధించిన ఆధారాలు దొరకక పోవడమా, లేక జగన్‌ను భయపెట్టి లొంగదీసుకోవడమా అన్నది అర్థం కావడం లేదు. ఇప్పటి వరకు సిబిఐ పెట్టింది మాత్రం ఉత్తుత్తి కేసులే. అటువంటి తాలు తరక కేసులతో ఆయన్ను ఎంతో కాలం జైలులో వుంచడానికి న్యాయస్థానాలు సైతం అంగీకరించవు. రాజీ వదంతులు వ్యాప్తిలోకి వచ్చిన నాటి నుంచి సిబిఐ కార్యకలాపాలు నిలిచిపోవడం, ఈడి విచారణ ఆగి పోవడం, జెడి లక్ష్మీనారాయణ కన్పించకుండా పోవడాన్ని చూస్తే నిప్పు లేనిదే పొగ రాదని అర్థమౌతుంది.

ఆ ఘోరాన్ని చూడలేము!

8వ పేజీ కొరవ

చర్య అంటే ఏమిటన్న స్పష్టత లేదు. రైల్వే అధికారుల మాటలు నమ్మడానికి లేదు. దేశంలో జరిగే రైలు ప్రమాదాలలో నూటికి డెబ్భై శాతం సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే అన్నది నిజం. అందువల్ల ప్రమాదాలు జరిగినప్పుడల్లా తమ బాధ్యత తప్పించుకోవడానికి విద్రోహ చర్య అని మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తుంటారు వారు. ఈ ప్రమాదం విషయంలోనూ రైల్వే అధికారుల ప్రకటనలకు విశ్వసనీయత లేదు.

రైలు పెట్టెలోని 50 నుంచి 58 బెర్తుల మధ్య వున్న భాగంలో కిటికీ కమ్ములతో సహా కాలిపోయి వున్నాయట. పెట్టె అడుగున చిన్న చిన్న రంధ్రాలు పడి వున్నాయట. వాటిని చూస్తే, ఆ భాగంలోనే ప్రమాదం పుట్టి వుండాలనే భావన కలుగుతున్నది. ఏ ప్రమాదకర రసాయనమో సీటు క్రింద పెట్టి వుండి, అది ప్రమాదవశాత్తు క్రిందకు కారి, మంటలు పుట్టి వుంటాయా? ఆ రసాయనం ఘాటుకు ప్రయాణీకులు వూపిరాడక విల విల లాడి తలా ఒక దిక్కుకు పరుగెత్తే సమయంలో ఆ రసాయనం అంటుకొని ఒక్కసారిగా మంటలు లేచి వుంటాయా అన్నది ఒక సందేహం. చివరకు అదే నిజం కావచ్చు.

మొత్తం మీద ఈ ప్రమాదం మొత్తం ఒక మిస్టరీగా వుంది. ఏది నిజమో, ఏది మభ్య పెట్టే మాటో, ఏది తప్పుడు అంచనాయో తేలడం లేదు. కారణం ఏదైనా జరగరాని ఘోరం జరిగిపోయింది. 28 నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరణించిన వారిలో అధిక సంఖ్యాకులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. శని, ఆది వారాల సెలవు కుటుంబంతో గడిపి, సోమవారానికి ఉద్యోగంలో చేరడానికి మద్రాసు వెళ్తున్న సాంకేతిక నిపుణులు. విలువైన వారి ప్రాణాలు ఇట్లా మంటలలో మాడి మసై పోవడం బాధాకరమైన విషయం.


డిఎన్ఎ పరీక్షే శరణ్యం!

మరొకప్రక్క ఆ శవాల దీన స్థితి చూస్తే కడుపులో దేవినట్లుంది. నాలుగు శవాలు మాంసపు ముద్దలుగా మారిపోయాయి. అవి ఎవరివో డిఎన్ఎ పరీక్షతో తేల్చి చెప్పాల్సిందే. మరొక ఏడు శవాలు ఎవరివో ఇంకా గుర్తించలేక పోతున్నారు. ఆరోజు రైలులో ప్రయాణించిన వారి బంధువులు, కుటుంబ సభ్యులు దీన వదనాలతో శవాలను దాచిన ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నారు. అధికారుల అలసత్వమో, అసమర్థతో తెలియదు కానీ, బాధితుల బంధువులు మాత్రం ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. తతిమా శవాలను బంధువులకు అప్ప చెప్పారు కానీ, అవి వట్టి మాంసం ముద్దలు మాత్రమే. ఏ అవయవమూ ఒక రూపంలో లేని మాంసపు ముద్దలను తమ స్వస్థలాలకు తీసుక వెళ్లలేక, భోరున విలపిస్తూ, ఇక్కడే అంతిమ సంస్కారాలు జరిపిస్తున్నారు... పాపం.

పెద్దాస్పత్రి డాక్టర్ల నిర్వాకం!

మరొక బాధాకర విషయం – మన పెద్దాస్పత్రి డాక్టర్లు ఇటువంటి ఆపద సమయంలో కూడా అమిత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని ఎవరికి తోచిన ఆస్పత్రిలో వారు చేర్పించారు. నారాయణ, బొల్లినేని, రామచంద్రారెడ్డి, జయభారత్ ఆస్పత్రులలో చేర్పించిన బాధితులకు సకాలంలో అత్యుత్తమ వైద్యం అందింది. కానీ పెద్దాస్పత్రిలో మాత్రం ఈ అభాగ్యుల పట్ల పూర్తిస్థాయి నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రభుత్వ డాక్టర్లు ఇంత మానవత్వ రహితంగా ఎందుకు ప్రవరిస్తారో అర్థమే కాని విషయం.

చనిపోయిన వారి శవాలన్నిటికీ నెల్లూరు రైల్వేస్టేషన్ వెయిటింగ్ రూమ్‌లో పోస్టు మార్టం జరిపారు. శవాలు మరొకచోటకు తరలించే పరిస్థితి లేకపోవడం వల్ల అది తప్పలేదు. దాని వల్ల స్టేషన్ పరిసరాలు అనారోగ్యకరంగా తయారై వున్నాయి. రైల్వే అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి, పరిశుభ్రత నెలకొల్పవలసిన అవసరం వుంది. లేకుంటే స్టేషన్‌కు వచ్చే ప్రయాణీకులు జబ్బున పడాల్సి వస్తుంది.



నెల్లూరు రైల్వే స్టేషన్‌లో కాలిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ బోగీని పరిశీలిస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు.

అధికారులు ప్రశంసనీయులు

ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీ, మునిసిపల్ కమిషనర్ వంటి అధికారులు చూపిన చొరవ, చేసిన సేవ అందరి ప్రశంసలు అందుకొన్నాయి. కేంద్ర రైల్వేమంత్రి కూడా వీరిని అభినందించారు.

జనవాణి

2వ పేజీ కొరవ

బియ్యం ధరలు అదుపులోనికి తెండి!

గత రెండు మాసాలుగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. నెల్లూరీయులు ఎక్కువగా వినియోగించే జిలకర మసూరి రకం బియ్యం కిలో 36రూపాయలుగా అమ్ముతున్నారు. అయినా వీటి నాణ్యత ఏమంత బాగోలేదు. రైతుబజార్లో ప్రభుత్వం అమ్ముతున్న జిలకర మసూరి బియ్యం మరీ ఘోరంగా వున్నాయి. జిలకర మసూరి రకం ధాన్యం పండే చోట రేట్లు ఆకాశానికి అంటడం, వాటిని అధికారులు అదుపు చేయలేకపోవడం బాధాకరం.

ఎం.సుభాషిణి నెల్లూరు

రాద్ధాంతమెందుకు?

ఉద్యోగుల సహకారం లేనిదే ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా నడవదనేందుకు గతంలో ఎన్టీ రామారావు, చంద్రబాబునాయుడు, జయలలిత ప్రభుత్వాలు పడిన ఇబ్బందులు చక్కని ఉదాహరణలు. ప్రజాధనంతో మాస జీతభత్యాలు పొందే బంట్రోతు మొదలు, ముఖ్య కార్యదర్శి వరకు వారి వారి స్థాయికి తగినట్లు ప్రజా సేవకులే. రాష్ట్రమంత్రి టిజి. వెంకటేష్ ఐఎఎస్ అధికారులను ఉద్దేశించి చేసిన వాఖ్యలు తప్పుదారిన నడిచే బిడ్డను సక్రమ మార్గంలో నడిపేందుకు అన్న మాటలుగా వారు అర్థం చేసుకోవాలి. ఒకరినొకరు వేలెత్తి చూపుకొంటూపోతే వ్యవస్థలో పలు లోపాలు బయట పడతాయి.

ఎన్.రామచంద్రారెడ్డి చెన్నై

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ప్రయాణీకుల శవాలను చూసి అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి హృదయాలు తల్లడిల్లాయి. ఈ ఘటన జరగగానే కలెక్టర్, ఎస్పీ, మునిసిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు అక్కడకు వచ్చిన సహాయక చర్యల్లో పాలుపంచుకొంటే రైల్వే అధికారులు మాత్రం తీరిగ్గా మధ్యాహ్నానికి రావడం తీవ్ర విమర్శలపాలైంది. ఉదయం ఐదు గంటల నుంచే అధికార యంత్రాంగం శ్రమిస్తుంటే బాధ్యత వహించాల్సిన రైల్వేశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహించారు.

ఎస్పీ ఔదార్యం

రైలు ప్రమాద ఘటనలో మిత్రులను కోల్పోయి ఏకాకిగా మారిన జమ్మూ కాశ్మీర్‌కు చెందిన యువకుడికి జిల్లా ఎస్పీ రమణకుమార్ సహాయం చేశారు. వీరంతా భోపాల్‌లో ఎంఫిల్ చేస్తూ రీసెర్చ్ నిమిత్తం మద్రాస్‌కు వెళ్తుండగా ప్రమాదం సంభవించడంతో పలువురు మరణించారు. ఒంటరిగా స్టేషన్‌లో దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆ యువకుడిని విచారించి సొంతంగా రెండువేల రూపాయలను ఇచ్చి మద్రాస్‌కు పంపించి తన జాలిగుణాన్ని చాటుకొన్నాడు ఎస్పీ.

శవాలపై నగలు తస్కరించే యత్నం

రైలు బోగీ దగ్ధమై గుర్తుపట్టలేని విధంగా మృతదేహాలు పడి వుంటే ఆ శవాలపై ఉన్న నగలను దొంగిలించడం మనిషిలోని పైశాచికత్వాన్ని తెలియజెప్పింది. పెద్దాసుపత్రిలోని మార్చురీలో పనిచేసే కొందరు సిబ్బందిని శవాలను తొలగించేందుకు పిలుచుక వచ్చారు. వీరిలో మధు అనే నరరూప రాక్షసుడు బోగీలోని మృతదేహాల నుంచి ఆభరణాలు తీసుకోబోతుండగా ఎస్పీ రమణ కుమార్ గమనించి సిబ్బందికి చెప్పడంతో వారు ఆ వ్యక్తిని పట్టుకొన్నారు. ఈ ఘటన మనిషిలో దాగి ఉన్న మృగత్వాన్ని వెల్లడించింది.

మసీదులకు వెళ్తున్న వివేకా

రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానంద రెడ్డి చేసే విన్యాసాలు అందరికీ తెలిసిందే. ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు ఉంటూ పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఎమ్మెల్యే పొద్దుటే అన్ని మసీదులను సందర్శిస్తున్నాడు. ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలోని మసీదుకు వెళ్లివస్తున్నాడు వివేకానందరెడ్డి.

పదరంగం -27

నిర్వహణ : బాబాజీ

1	2	3			■	4	5			6
7			■	■	■	8		■	■	
	■	9			10		■	11		
12	13		■	■		■	14		■	■
■		■	15	16	■	17				■
19	■	20			21	■		■	22	23
■	24	■	25			■	■	26		
27		28		■	■	29	30		■	
	■	31		■	32	■		■	33	■
	■		■	34		35	■	36		37
38					■	39			■	

అడ్డం

1. విశ్వామిత్రుని స్వర్గం (5)
4. అధిరోహించడం (5)
7. కోయల, శుకముతో పాటిదే (3)
8. ఆనందం, టేస్ట్‌ఫుల్ (2)
9. అణచివేసే వికృతచర్య (5)
11. కన్నీరు, ఆవిరి (3)
12. చుంబనాలు, అటు నుంచే (3)
14. అటు నుంచి చేపలను పట్టే జాలం (2)
15. గుడిసె (2)
17. పవిత్రము (4)
19. ఇంగ్లీషు చెట్టు (1)
20. తిరుప్పావై పద్యాలు (4)
22. అటు నుంచి – చివర, అంచు (2)
25. పూర్వకాలపు గ్రామ ఉద్యోగి (3)
27. చివరాఖరికి (4)
29. సరిగ్గా లేని 'సకల' (3)
31. కాగితాల కట్ట, ఫైలు (2)
34. చొరవ, తెలివి, ధైర్యం ఇది కలవాడే వంశ తిలకుడు అన్నాడు సుమతీకారుడు (3)
36. దగా, కన్నింగ్‌నెస్ (3)
38. లోపాలు, అవకతవకలు (5)
39. సాంప్రదాయం అలవాటు (3)

నిలువు

1. బౌద్ధుల పవిత్ర గ్రంథం (4)
2. అనుమానం (2)
3. కమలం (4)
4. పది మైళ్ళ దూరం (3)
5. గులాబి పువ్వు (2)
6. ఎటు నుంచి అయినా సంతోషమే (3)
10. స్త్రీ (2)
11. తలంపు, ఆలోచన (3)
13. వృషభం క్రింద నుంచి వస్తున్నది (2)
14. ఉప్పు (3)
15. అర్జునుని తిరుగులేని బాణం (5)
16. చైనా, జపానుల యుద్ధ కళ (3)
18. వృద్ధాప్యంలో ఉన్నవారు (3)
21. రెండు 'టీ'లు (2)
23. కమ్మరి పొయ్యి చెదిరింది (3)
24. మాతను పిలవండి (2)
26. విడిది, నివసించే చోటు (2)
27. జారుడు, వాటం సరిగాలేని (4)
28. ఆర్గ్యుమెంట్స్ (4)
30. డబ్బుల తల్లి (2)
32. శ్రేష్ఠమైన కలప (2)
33. సారం, న లేని పనస (2)
34. వృశ్చికం (2)
35. ధాన్యం (2)
36. లాలస, ఇష్టం (2)
37. ఋషి (2)

సమాధానాలు

పదరంగం -26

1ప్ర	వ	ర్ద	మా	2నం	■	3సం	4తా	ప	5ము	■
ళ				ది	■	6క	ళ్ళ	■	7క్తి	ర
య		8కా		వ	■	9ట	పా	■	■	■
10కా	ళీ	య	11మ	ర్ద	12నం	■	13క	14పా	ల	15ము
వే			16ఆ	నం	ది	ని	■	దు	■	సి
17రి	18మ్మ	■	ని	■	తా	■	■	19క	వ్వ	ము
■	20క	21పా	■	■	22బో	ద	23కా	లు	■	సి
24ప్ర	■	ము	■	■	న్	■	ర్యం	■	25గో	న
26పం	చె	ల	27చా	28పు	■	■	■	■	29పు	వ్వు
చ	■	30ప	రు	లు	■	31రో	■	32చ	ర	■
33ము	న	గ	■	34పు	ర	మం	ది	ర	ము	■

సంక్షిప్త సింహపురి

నరేంద్రబాబుకు అవార్డు ప్రదానం



గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ తన 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు పెన్నా రచయితల సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబుకు సాహిత్యరత్న అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతులమీదుగా 27వ తేది నరేంద్రబాబుకు అందించారు. అవార్డు నందుకొన్న నరేంద్రబాబును పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు షంషుద్దీన్, ప్రధాన కార్యదర్శి జి.సుభద్రాదేవి ఉపాధ్యక్షులు అన్నపూర్ణ సుబ్రహ్మణ్యం, అనురాధా రామకృష్ణ తదితరులు అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లపై విచారణ జరపండి!



నెల్లూరు వైఎస్ఆర్ నగర్‌లో నాణ్యత లేకుండా కట్టిన ఇందిరమ్మ ఇళ్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో విచారణ జరిపించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు మందా బాబ్జీ డిఆర్వోను కలసి వినతిపత్రం ఇచ్చారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నెల్లూరు ప్రజలపై ప్రత్యేక ప్రేమతో 2008 సంవత్సరంలోనే కొత్తూరు వద్ద 170 ఎకరాలను 6468 మందికి ఇళ్లు కట్టుకోను స్థలం మంజూరు చేశారన్నారు. తొమ్మిది అంకణాల స్థలంలో 220 చదరపు అడుగుల గృహాన్ని నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో 28 మంది కాంట్రాక్టర్లకు ఈ పనులు అప్పగించారు. వీరు సరిగ్గా పనులు చేయకుండానే 28.70 కోట్ల రూపాయల బిల్లులు చేసుకొన్నారన్నారు. కట్టిన ఇళ్లు నాణ్యత లేకుండా ఉన్నాయని రోడ్లు, విద్యుద్దీకరణ, మంచి నీటి సౌకర్యాలు దెబ్బతిన్నాయని ఈ వ్యవహారమై దర్యాప్తుకు ఆదేశించి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని బాబ్జీ డిఆర్వోను అభ్యర్థించారు.

ఎమ్మీ సాయం

నెల్లూరు ఎమ్మీ మేకపాటి రాజమోహన్ రెడ్డిలో మార్పు కనపడుతుంది. గతంలో ప్రజా సమస్యలపై పెద్దగా స్పందించని ఆయన బాగా ఇబ్బందులు పడుతున్న వారి వద్దకు వెళ్లి బాసటగా నిలుస్తున్నారు. నెల్లూరు – ముత్తుకూరు రోడ్డుపై నివాసముండిన 350 కుటుంబాలను రోడ్డు విస్తరణ పేరిట రాత్రికి రాత్రి కొత్తూరు దగ్గర ఖాళీ స్థలం చూపి తరలించి వేశారు. మూడు నెలలు దాటినా అక్కడ కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఈ 350 కుటుంబాలు నానాపాట్లు పడుతున్నాయి. ఈ కాలనీని 26వ తేది మేకపాటి రాజమోహన్‌రెడ్డి సందర్శించారు. తక్షణ అవసరమైన మంచినీటి సరఫరాకు ఐదు లక్షల రూపాయలు అందించారు. ఈ ప్రాంతీయులకు కనీస సౌకర్యాలు కల్పించమని కలెక్టర్‌ను, దోమలు కుట్టడంతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య సదుపాయం కల్పించమని డిఎంఅండ్‌హెచ్ఓను ఆదేశించారు. మేకపాటితో ఆనం వెంకటరమణారెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి ఈ ప్రాంతానికి వెళ్లారు. ఈ ప్రాంతీయులు తనను నిందించారని వివేకా ఈ కాలనీకి ఎటువంటి వసతులు కల్పించలేదు.

గోమతి స్కూల్‌లో కూచిపూడి నృత్యప్రదర్శన!




నెల్లూరు మినీ బైపాసు రోడ్డులోని గోమతి స్కూల్‌లో 25వ తేది ప్రఖ్యాత కూచిపూడి నర్తకుడు ఏలేశ్వరపు శ్రీనివాస్ నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ యుఎస్ఏ, కెనడా, ఫ్రాన్స్ దేశాలలో అనేక నృత్య ప్రదర్శనలతోపాటు కామన్‌వెల్త్ సమావేశాలలోనూ మన దేశం తరపున కూచిపూడి నృత్యం చేసిన నర్తకుడు. ఈయన అద్భుత నాట్య విన్యాసానికి స్కూల్ ఆడిటోరియమ్‌లో ఆహూతులైన విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లితండ్రులు చప్పట్ల వర్షం కురిపించారు. హైస్కూల్ నిర్వాహకులు అరుణ, డాక్టర్ రాజశేఖర్ ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

కొండాయపాళెం గేటు హాస్టల్ తెరవండి!



నెల్లూరు కొండాయపాళెం గేటు వద్ద మూసి ఉన్న ఎస్‌సి బాలుర హాస్టల్‌ను వెంటనే తెరవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ దళిత విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ 25వ తేది కలసి వినతి పత్రం అందించారు. జిల్లాలోని 46 మండలాలకు చెందిన నిరుపేద, మధ్యతరగతి ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఇంటర్, డిగ్రీ, పిజి, పాలిటెక్నిక్, ఐటిఐ కోర్సులు ఇక్కడ ఉండి చదువుకొంటారు. ఈ హాస్టల్‌ను గత రెండు నెలలుగా తెరవకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ హాస్టల్‌ను తెరచి విద్యార్థులను ఆదుకోవాలని పూర్ణప్రకాష్ కోరారు.



మల్లెతోటల్లో సస్యరక్షణ చర్యలు!

మల్లెతోటల్లో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మల్లెను నష్టపరిచే చీడపీడల్లో మొగ్గతొలిచే పురుగులు, నల్లి, ఎండు తెగుళ్లు ప్రమాదకరమైనవి.

మొగ్గతొలిచే పురుగులు

వీటి లార్వాలు మొగ్గలను తొలుస్తూ వాటిని ఒక దగ్గరకు చేర్చి ముడుచుకుపోయేలా చేస్తాయి. వీటి నివారణకు ముందుగా 5శాతం వేపగింజల కషాయాన్ని, తర్వాత 10రోజులకు లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్ల చొప్పున మలాధియాన్ లేదా ఎండోసల్ఫాన్ కలిపి పిచికారి చేయాలి.

నల్లి

పొడి వాతావరణంలో వీటి ఉధృతి అధికం. వీటి పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోతాయి. వీటి నివారణకు గంధకపు పొడిని ఎకరానికి 10కిలోల చొప్పున చల్లుకోవాలి లేదా లీటరు నీటికి ఐదు మిల్లీ లీటర్ల చొప్పున డైకోఫాల్ కలిపి పిచికారి చేయాలి.

ఆకుఎండు తెగులు

ఈ తెగులు ఆశించిన ఆకులు దళసరిగా మారతాయి. ఆకుల పైభాగంలో ఎరుపురంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ తెగులు తీవ్ర దశలో వుంటే 50శాతం దిగుబడి తగ్గుతుంది. తెగులు నివారణకు 3గ్రాములు డైథేన్ ఎం–45 లేదా కార్బండజిమ్‌ను ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఎండు తెగులు

ఈ తెగులు కారణంగా తొలిదశలో మొక్కల క్రింది భాగాన వున్న ఆకులు ఎండిపోతాయి. తర్వాత పైభాగాన వున్న ఆకులు ఎండి రాలిపోతాయి. తెగులు ఉధృత దశలో మొక్కలు ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపిన ద్రావణాన్ని మొక్కలు చుట్టూ భూమి తడిచేలా పోయాలి.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

జగన్‌కు మేలు చేస్తున్న జైలు జీవితం!



పదిహేను రోజులైంది – సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పేరు విని. పది రోజులైంది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు జైలులో జగన్‌ను విచారణ జరిపి. నెల రోజులైంది – న్యాయస్థానంలో సిబిఐ ఛార్జిషీట్ దాఖలు చేసి. ఒక్క పత్రికా వీటిపై వార్తలు ప్రచురించడం లేదు. ఒక్క టీవీ ఛానల్ కూడా వీటిపై ప్రత్యేక కథనాలు ప్రసారం చేయడం లేదు. ఎవరికి వారు అదొక వార్తాంశం కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. జగన్ అక్రమ ఆస్తుల కేసులో పదిహేను రోజుల ముందు వరకు సిబిఐ ఎంత సందడి చేసిందో, దానికి పత్రికలు, టీవీ ఛానళ్లు ఎంత ప్రచారం కల్పించాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ఒక్కసారిగా వారం దరూ చేష్టలుడిగి పోవడానికి కారణం ఏమిటి? ఎవరికీ అంతుబట్టడం లేదీ చిదంబర రహస్యం.

మరొకప్రక్క జైలులో పరిస్థితి వేరుగా వుంది. సాధారణ ఖైదీలకు జైలంటే నాలుగు గోడల మధ్య నరకం. ఇనుప ఊచల వెనుక మానసిక హింస. పలకరించే మనిషి వుండడు. స్నేహితులు, చుట్టాలు వుండరు. దిన చర్యలు ఒక శాపం. బాత్‌రూంలోకి వెళ్తే ముక్కు పగిలే కంపు. పైగా దానికి క్యూ. బిక్ష గాడి వలె చిప్ప పట్టుకొని, వరసలో నిలబడి పిడికెడు అన్నానికి వెంపర్లాడాలి. బయట ప్రపంచంతో సంబంధం వుండదు. ఏమి జరుగుతుందో తెలియదు. దుర్భరమైన జీవితం. కానీ జగన్‌కు మాత్రం జైలు వేసవి విడిది కేంద్రంగా వుంది. ప్రత్యేకమైన గది. స్వంత వంట మనిషి. తోటి ఖైదీలే పరిచారకులు. జైలరు, సిబ్బంది ఆయన ఆజ్ఞ కోసం ఎదురు చూస్తుంటారు. కావల్సినంత తీరిక. దాన్ని బాగా సద్వినియోగం చేస్తున్నాడు జగన్.

తన రాజకీయ ఆశలు నెరవేర్చుకోవడానికి కావల్సిన వ్యూహాలు, ప్రణాళికలను తయారు చేసుకోవడంలో నిమగ్నమైపోయి వున్నాడు ఆయనిప్పుడు. జనంలో ఆయనకున్న మోజు, మొన్నటి ఉపఎన్నికలలో లభించిన ఘనవిజయాల తర్వాత జైలు అధికారులు జగన్‌ను చూసి భయపడుతున్నారు. ఆయన ఏది కోరితే దాన్ని అందించేందుకు పోటీలు పడుతున్నారు. దానితో ఆయనకు పత్రికలు అందుబాటులో వున్నాయి. టెలిఫోన్ సౌకర్యం నిరంతరాయంగా లభిస్తున్నది. బయట ఏమి జరిగేది క్షణక్షణానికి తెలిసిపోతున్నది. కుటుంబ సభ్యులతో, పార్టీ ముఖ్యులతో ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి జరిగి పోతున్నది. పైగా కావల్సినంత తీరిక. బయట వుంటే నిత్యం ఏదో ఒక పర్యటన, సభలు, సమావేశాలు, చుట్టు ముట్టే జనం. కానీ లోపల ఆ చీకాకులేవీ లేవు. ప్రశాంతంగా, తీరికగా, నిదానంగా తన పార్టీ వ్యవస్థీకృతానికి ఆలోచన చేయగల్గుతున్నాడు. అందుకొక ఉదాహరణ – ఇటీవల జరిగిన మూడు జిల్లా అధ్యక్షుల మార్పిడి. ఖమ్మం, వరంగల్, పశ్చిమగోదావరి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులను మార్చి కొత్తవారిని పెట్టే నిర్ణయం జైలు నుంచే తీసుకొన్నాడు జగన్. రామచంద్రాపురం, నరసాపురం నియోజకవర్గాలలో మొన్నటి ఓటమికి కారణాలను విశ్లేషించడంలో సైతం జగన్ జైలు తీరికను బాగా వాడుకొన్నాడు. ఏ కులం, ఏ వర్గం, ఏ గ్రామనేత తన ఓటమికి కారణమో విశదంగా విశ్లేషించి, ఆ లోపాలను సవరించుకోవడానికి చేయవలసింది ఏమిటో వివరిస్తూ పార్టీ ముఖ్యులకు నివేదిక పంపాడాయన. వైఎస్ విజయమ్మ సిరిసిల్లలో ధర్నా చేపట్టడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించడం వంటి వన్నీ జగన్ నిర్ణయం ప్రకారమే నడుస్తున్నాయి.

2014 ఎన్నికలలో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో ఏ వ్యూహం అనుసరించాలి అన్న దానిపై కూడా జగన్ నుంచి స్పష్టమైన మార్గ దర్శకాలు అందుతున్నాయి పార్టీ ముఖ్యులకు. చాలా జాగ్రత్తగా, ప్రతి చిన్న అంశాన్ని కూడా నిశితంగా పరిశీలన చేసి, మార్గదర్శకాలు రూపొందిస్తున్నాడు జగన్. అందుకు ఎవరితో అవసరమైతే వారితో సంప్రదిస్తున్నాడు. ఆ కోణం నుంచి చూస్తే ఒక రకంగా జైలు జీవితం కూడా జగన్ మేలుకే జరిగినట్లు కన్పిస్తున్నది.

అయితే ఎన్ని సుఖాలు, సౌకర్యాలు వున్నా జైలు... జైలే తప్ప ఇల్లు కాదు. అందువల్లే బెయిల్ కోసం కేంద్రంతో రాజీ పడుతున్నాడని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అయితే ఆ రాజీకి ప్రాతిపదిక ఏమిటో ఎవరూ వూహించలేక పోతున్నారు. రాజకీయ ఆశలను సమాధి చేసి కాంగ్రెస్ శరణు చొచ్చే రకం కాదు జగన్. కానీ అంతర్గతంగా ఏదో జరుగుతున్నదని నడుస్తున్న పరిణామాలు స్పష్టమైన సంకేతాలిస్తున్నాయి. మరొకప్రక్క విచిత్రంగా సుప్రీంకోర్టు నుంచి తన బెయిల్ దరఖాస్తును ఉపసంహరించుకొన్నాడు జగన్. ఆ దరఖాస్తు చీఫ్ జస్టిస్ బెంచ్‌కు వెళ్లనుందని తెలియడం వల్లనే ఆ నిర్ణయమని చెప్తున్నారు. చీఫ్ జస్టిస్ ఎస్‌హెచ్.కపాడియా రాజకీయ అవినీతి కేసుల విషయంలో ఎంత కఠినంగా వ్యవహరించేది అందరికీ తెలుసు. అందువల్లనే తన దరఖాస్తు ఆయన పరిశీలనకు వెళ్తే, ఖచ్చితంగా తిరస్కరణకు గురౌతుందని భయపడి వెనక్కు తీసుకొన్నాడట.

ఇప్పటి వరకు సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లను చూస్తే ఆయన్ను ఎంతో కాలం జైలులో బంధించి వుండలేరని న్యాయ నిపుణుల అభిప్రాయం. ఆ కేసులలో దమ్ము లేదు. ఆయన్ను జైలులోనే కొనసాగించాలంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగాలి. ఆ శాఖ అధికారులు జైలులో విచారణకు వచ్చిన నాటి నుంచే జగన్ – కాంగ్రెస్‌ల రాజీ అనే మాట విన్పడుతూ వున్నది. దానికి తగినట్లే, జగన్‌ను ఆరు రోజుల పాటు విచారించడానికి కోర్టు అనుమతి తీసుకొన్న ఈడి అధికారులు రెండంటే రెండు రోజులు మాత్రమే

కొరవ 14వ పేజీలో

బాబుకు ఊపిరి!

జగన్ విషయంలో కేంద్రం కొంత సానుకూల వైఖరి అవలంభిస్తున్నదనే వార్తలు తెలుగుదేశానికి వరప్రసాదంగా పరిణమిస్తున్నాయి. రేపటి ఎన్నికలలో జగన్ విజయం ఖాయమని ఉప ఎన్నికలు రుజువు చేసిన నాటి నుంచి తెలుగుదేశం పరిస్థితి హీనంగా తయారైంది. తమకిక భవిష్యత్తు లేదనే బలీయమైన అభిప్రాయంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు పెద్ద సంఖ్యలో వలసలకు సిద్ధపడ్డారు. వారిని నిలువరించడం చంద్రబాబుకు అలివి కాలేదు. కనీసం కార్యకర్తలకైనా ఆశ కల్గించాలని బాలకృష్ణను రంగంలోకి దించారు. కానీ అది కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. జూనియర్ ఎన్టీఆర్ ఎంత గట్టిగా పార్టీ అనుకూల ప్రకటనలు చేసినా సానుకూల వాతావరణం ఏర్పడలేదు. దీనితో పార్టీని నిలబెట్టుకోవడం కష్టమనే నైరాశ్యం చంద్రబాబును కూడా ఆవరించింది.

కొరవ 14వ పేజీలో

కెవిపి ఆంతర్యం ఏమిటి?




కెవిపి రామచంద్రరావు మరొకసారి నోరు విప్పాడు. అందరు రాజకీయవాదుల వలె కాదు కెవిపి. ఆయన విషయంలో నోరు విప్పడమనేది పెద్ద విశేషం క్రింద లెక్క. కోపాన్ని, తాపాన్ని, ఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని మనసులోనే అణుచుకొని, పెదవి విప్పకుండా, మాట తూలకుండా, ముఖంపై ఎటువంటి భావాలూ కన్పించకుండా గుంభనంగా వుండిపోవడం కెవిపి ప్రత్యేకత. అందువల్లనే ఆయన అమావాస్యకో పౌర్ణమికో నోరు విప్పితే పెద్ద వార్తగా పరిగణన అవుతుంది. ఇప్పుడాయన గాంధీభవన్ సభ వేదిక మీద వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫోటో లేదని హుంకరించాడు. ఆ ఒక్క మాటలో ఎన్నో అర్థాలు తీస్తున్నారు పరిశీలకులు.

కెవిపికి, వైఎస్‌కు వున్న స్నేహం జగద్విఖ్యాతం. వైఎస్ అధికారంలో వున్ననిన్నాళ్లూ వసూళ్ల బాధ్యత నెరపింది ఆయనే. ముడుపులు కట్టి ఢిల్లీకి కప్పం కట్టింది, రాష్ట్రంలో జరిగిన వివిధ ఎన్నికల ఖర్చు పద్దులు చూసిందీ ఆయనే. వైఎస్ లేకుంటే కెవిపికి రాజకీయ ఆనవాలు లేదు. కానీ వైఎస్ మరణం తర్వాత ఆయన కుమారుడు వైఎస్ జగన్ కాంగ్రెస్‌తో, ప్రభుత్వంతో విభేదించి స్వంత కుంపటి వెలిగించుకొంటే కెవిపి ఆ చాయలకు కూడా వెళ్లలేదు. రోశయ్య ముఖ్యమంత్రిగా వున్నన్ని రోజులూ పాత బాకీల వసూలు, పాత ఫైళ్ల మీద సంతకాలు, స్వంత పెట్టుబడుల వ్యవహారాలలో బిజీగా గడిపాడు. ఒక్కరోజు కూడా పదిమందికి తెలిసే ధోరణిలో జగన్ పక్కన చేరలేదు. కిరణ్‌కుమార్‌రెడ్డి వచ్చిన తర్వాత ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలలో వైఎస్‌పేరు, ప్రస్తావన తగ్గిపోయింది. చాలా సభలు ఆయన ఫోటో లేకుండానే జరిగాయి. కానీ ఇంతకాలం ఆ విషయంలో కెవిపి మాట్లాడింది లేదు. కానీ ఇప్పుడు వున్నట్లుండి గాంధీభవన్‌లో జరిగిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారసభలో ఆ ప్రస్తావన తెచ్చాడు.

అందుకు కారణం ఏమై వుంటుందన్నది ప్రశ్న. వైఎస్ మీద ప్రేమతో ఉద్వేగానికి లోనైనాడని ఒక వర్గం వాదన. కానీ గతంలో ఎప్పుడూ కలగని ఉద్వేగం ఇప్పుడే ఎందుకు కల్గిందన్నది ప్రశ్న. కేంద్ర ప్రభుత్వం జగన్ విషయంలో కొంత మెతక వైఖరి అవలంభిస్తున్నదని, ఆ సంకేతాలు తనకు అందడం వల్లనే వైఎస్ మీద భక్తిని ప్రదర్శించుకోవడానికి దీన్నొక అవకాశంగా వాడుకొన్నాడని మరొక వర్గం వాదన. బహుశా నిజం కూడా అదే అయి వుండవచ్చు.

కార్టూన్ స్పేస్



చరిత్ర మారడం అంటే
మీరు సిఎం కుర్చీ ఎక్కడమేనా సార్!

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com